విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 30 అక్టోబరు 2025   8 పేజీలు

తుపాను సహాయక చర్యలు ముమ్మరం చేయండి

మంత్రి నాదెండ్ల

ముందస్తు చర్యలతో నష్టాలను నివారించాం

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లాలో తుపాను సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం తుఫాన్ సహాయక కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ కార్యదర్శి, తుపాను సహాయక ▶మిగతా 2లో..

అపారనష్టం

- మొంథా తుపానుతో లక్షలాది రూపాయల నష్టం
- నేలకొరిగిన వరిచేలు, అరటి తోటలు
- ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- కొట్టుకుపోయిన మత్స్యకారుల వేట సామాగ్రి

విశాలాంధ్ర - మామిడికుదురు : మొంథా తుపాను తీరం దాటడంతో చిగురుటాకులా వణికిన గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ దిశా నిర్దేశం చేయడంతో పాటు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పల్లెలు, పట్టణాలలో క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో తుపానును సమర్ధవంతంగా ఎదుర్కోగలిగారు. బలమైన ఈదురగాలులకు కొబ్బరి చెట్లు, భారీ వృక్షాలు, వందల ఏళ్ల కాలం నాటి వృక్షాలు కూలిపోవడంతో విద్యుత్ శాఖకు తీరని నష్టం వాటిల్లింది.

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

మొంథా తుపాను ధాటికి మామిడికుదురు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటివరకు 130కి పైగా కరెంట్ పోల్స్, 10కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం అయ్యాయని ఇంచార్జి అసిస్టెంట్ ఇంజినీర్ వై.వెంకటేశ్వర రావు తెలిపారు. గత రెండు రోజుల నుండి తమ సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనుల్లో నిమగ్నమై ఉన్నారని ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

ఆందోళనలో అన్నదాతలు

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సరికి ప్రకృతి ప్రకోపానికి బలైపోతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మామిడికుదురు మండలంలో 2700కి పైగా ఎకరాల్లో వరి సాగు జరగగా వివిధ దశల్లో ఉన్న వరి పంట మరో మూడు వారాల్లో చేతికి అందివస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్న రైతులకి మొంథా తుఫాన్ తీరని నష్టాన్ని మిగిల్చింది. సుమారు ▶మిగతా 2లో..

అన్నదాతకు అండగా ఉంటాం

- రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ సుడిగాలి పర్యటన
- నేలకొరిగిన పంట పొలాల పరిశీలన
- ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం
- పంట నష్టాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా

విశాలాంధ్ర - అమలాపురం : అన్నదాతలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గాలివానలు, తుఫాన్ కారణంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నీట మునిగి, నేలమట్టమైన పంట పొలాలను కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలోని ఓదూరు, చేదువాడ, తర్లంపూడి, శీల గ్రామాల్లో పంట పొలాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 51,800 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుందని, భారీ వర్షాలు, తుపాను తాకిడికి 80 శాతం మేర పంట పొలాలు నేలమట్టం అయ్యాయని అన్నారు. పంట నష్టం వివరాలను ఒక సమగ్ర నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం, కె గంగవరం, కాజులూరు మండలాల్లో మొత్తం 51 వేల 800 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగులో ఉన్నాయని, అందులో సుమారు 41 వేల ఎకరాల్లో పంటలు నేలమట్టం అయినట్టు గుర్తించామన్నారు. ప్రస్తుతం పంటలు గింజ గట్టిపడే ▶మిగతా 2లో..

ఎర్రకాలువ పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో నల్లజర్ల మండలంలోని అనంతపల్లి గ్రామం వద్ద ఎర్ర కాలువ వరద నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం పరిశీలించారు. కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ నల్లజర్ల, ఇరిగేషన్ శాఖ డీఈఈ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎర్ర కాలువలో నీటి మట్టం పెరుగుదల, ముంపు ప్రభావిత ప్రాంతాలు, జంగారెడ్డిగూడెం వద్ద జరుగుతున్న ప్రాజెక్టు నిర్మాణ స్థితి వంటి అంశాలపై కలెక్టర్ కీర్తి చేకూరి క్షేత్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "ఖమ్మం జిల్లా, భద్రాది కొత్తగూడెం జిల్లాల నుంచి ఎర్ర కాలువకు వరద నీరు వస్తోందని, ఎగువ ప్రాంతాల నుంచి ఎంత వరద నీరు వస్తే ఇక్కడ ముంపు ప్రభావం ఉంటుందో ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. కాలువ మొత్తం 4 టీఎంసీ సామర్థ్యం కలిగి ఉండగా, ప్రస్తుతం 2.5 టీఎంసీ నీరు ఉందని అధికారులు పేర్కొన్నారు. రూట్ మ్యాప్ ఆధారంగా వరద నీటి ప్రవాహ దిశ, ▶మిగతా 2లో..

ముదినేపల్లి విలవిల

- నేలకొరిగిన చెట్లు, వరి పొలాలు
- భయం గుప్పెట్లో ఆక్వా రైతులు
- నిర్వాసితులకు అండగా పునరావాస కేంద్రాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : మొంథా తుఫాన్ తాకిడికి ముదినేపల్లి ప్రజలు భయం గుప్పెట్లో విలవిలలాడారు. తుపాను కారణంగా మండలంలోని పెదగొన్నూరు , కొర్రగుంటపాలెం , కొత్తపల్లి , అల్లూరు , చిగురుకోట , వడాలి గ్రామాల్లో ప్రాథమిక సమాచారంగా సుమారు 2వేల ఎకరాల వరి దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఎం. వేణుమాధవ్ తెలిపారు. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో కోరుకొల్లు-బొమ్మినంపాడు, సింగరాయపాలెం వరకు కొత్తపల్లి , పెదగోన్నూరు వద్ద చెట్లు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ముదినేపల్లి ఎస్ఐ వి.ఎస్ వీరభద్రరావు తన సిబ్బందితో వాహనాల ▶మిగతా 2లో..

నరసాపురంలో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-నరసాపురం: బుధవారం తెల్లవారుజామున తీరం దాటిన మొంథా తుపాను కారణంగా నరసాపురం మండలంలో దెబ్బతిన్న పలు గ్రామాలలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో నరసాపురం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఉన్నారు. ఆక్వా రైతులను, బాధితులను పరామర్శించారు. నరసాపురం మండలం చిన్నమైనవాని లంక వద్ద నల్లిక్రిక్ ఉప్పొంగి రోడ్డు కోతకుగురై గండిపడిన ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడారు. సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో చెరువులు పూర్తిగా నీటమునిగి దెబ్బ తిన్నాయని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు కలెక్టర్ తెలిపారు. వేములదీవి ఈస్ట్ వెస్ట్ కుక్కిలేరు వద్ద గట్టు పైనుండి నీరు పొంగి కొంతమేర కరుణానగర్ కాలనీలోకి చొచ్చుకువచ్చిన నీటిని పరిశీలించి, బాధితులను పరామర్శించారు. జిల్లా యంత్రాంగం పునరావాస కేంద్రానికి తరలిరమ్మన్నపుడు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటి అని కాలనీ వాసులని నిలదీశారు. పర్యటనలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ ఐతం సత్యనారాయణ, మత్స్య శాఖ ఎడి ఎల్.ఎల్.ఎన్.రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు,వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నేలకొరిగిన వరి పంట

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో తుపాను ప్రభావం చూపక పోవడంతో రైతులు,ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో మండల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

అదృష్ట వశాత్తు దీని ప్రభావం చూపకపోవడం ప్రజల్లో ఊరట నిచ్చింది. అయితే ఈనెల24 నుంచి29 వరకు మండలంలో 110మీ.మీ వర్షం పడింది. పడిన వర్షం వల్ల కోతకు సిద్ధమైన వరి పంట నేలకొరిగింది. నేలకొరిగిన పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రదీప్ కుమార్ పరిశీలించారు. దాదాపు 100 ఎకరాలలో పంట నేలకొరిగిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.12 వేల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నష్టం అంచనా పూర్తిస్థాయిలో వేయాల్సి ఉందని వ్యవసాయ అధికారి అన్నారు.

ఆశలను అవకాశాలుగా మలుచుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ

ఏపీ నిట్‌లో ఘనంగా టెడ్ఎక్స్

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: ఆశలను అవకాశాలుగా మార్చుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ అని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద గడియారం సూచించారు.

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో టెస్సెలేట్ అనే నేపథ్యంలో టెడ్ఎక్స్ కార్యక్రమాన్ని ప్రాంగణం లోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచదేశాలకు ధీటుగా రాణిస్తుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రీడమ్ విత్ ఏఐ సిఈఓ అవినాష్ మాడ, కోస్ట్ గార్డ్ వెటరన్ ఆతార్ వామా గౌర్ ,ఎలికో హెల్త్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వనిత దాట్ల, ఐఐటి మద్రాస్ ఆచార్యులు, పిన్ కాల్ డాట్ కామ్ వ్యవస్థాపకులు డాక్టర్ పట్టాభిరామన్ మాట్లాడారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కే.హిమ బిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి కో ఆర్డినేటర్‌గాను, ఆర్గనైజర్ గా పయ్యావుల కృష్ణప్రియా, కో ఆర్గనైజర్‌గా వేదాంత్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ డాక్టర్ జీబి.వీరేశ్ కుమార్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శీనివాసన్, డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరం చేయండి (1వ పేజీ తరువాయి)

కార్యక్రమాల పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్‌దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని, వాటిని అధికారులు పరిష్కరించడం నష్టాన్ని నివారించగలిగామన్నారు. జిల్లా యంత్రాంగం మనసు పెట్టి మంచి స్ఫూర్తితో పనిచేశారని, అదే స్ఫూర్తితో తుపాను అనంతరం సహాయక కార్యక్రమాలను ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగని రీతిలో చేపట్టాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మంత్రులు, ప్రజాప్రతినిధులు, తుఫాన్ ప్రత్యేక అధికారులు అందించిన సూచనలతో ముందుగానే ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించడంతో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదన్నారు. . ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మునిగిన పంటలను పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం మండలం చినఅమీరం గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా నీటమునిగిన వరి పొలాలను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తుఫాను కారణంగా నీట మునిగిన వరి పొలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 5,984 ఎకరాలు వరి పంటకు గాను 1,689 రైతులకు సంబంధించిన 3,340 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట నీట మునిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి 5రోజుల్లో పంట నష్టాల వివరాలు సేకరించి సంబంధించిన యాప్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. అనాకోడేరు, బొండాడ డ్రైన్‌లు పూర్తిగా బాగు చేయకపోవడం, ఆక్రమణలకు గురికావడం వలన భారీ వర్షాలకు పంట పొలాలు మునిగిపోయి ఏటా పంట నష్టపోతున్నామని రైతులు జెసి వద్ద మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆర్డిఓ,

తహసిల్దారులను డ్రైయిన్లు సర్వే చేయించేందుకు చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఏ డి ఏ కె.శ్రీనివాస్, తహసిల్దార్ రావి రాంబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, రైతులు, తదితరులు ఉన్నారు.

విలవిల

(1వ పేజీ తరువాయి)

రాకపోకలు క్రమబద్ధీకరించ డానికి యుద్ధ ప్రాతిపాదికన చెట్లను తొలగించారు. వడాలి, ముదినేపల్లి, అల్లూరు , ప్రొద్దువాక గ్రామాల్లో పలు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా గురజలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. ఎన్డీఏ నాయకులు వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, పోసిన పాండురంగారావు, పోలవరపు లక్ష్మీరాణి, పిజెఎస్ మాల్యాద్రి, ఎండి జానీ, పెనుమత్స త్రినాధరాజు తదితర నాయకులు నిర్వాసితులను పరామర్శించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

పరిశీలించిన కలెక్టర్

(1వ పేజీ తరువాయి)

ముంపు ప్రమాద ప్రాంతాలను ఇంజినీరింగ్ బృందంతో సమీక్షించిన కలెక్టర్ అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి, కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నల్లజర్ల మండల పరిధిలో 1,235 హెక్టార్లలో వరి సాగు జరగగా, మొంథా తుఫాను ప్రభావంతో 110 హెక్టార్ల పంట పడిపోయి, నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటి వరకు సేకరించిన డేటా ప్రకారం మండలంలోని 12 గ్రామాలకు చెందిన 83 మంది రైతులకు ఈమేరకు నష్టం జరిగిందన్న అంచనాలకు వచ్చినట్లు అధికారుల నుంచి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అధికారులు శాఖల మధ్య సమన్వయంతో పని చేసి ఎవరూ ఆందోళన చెందకుండా చూడాలని పేర్కొన్నారు.

అండగా ఉంటాం

(1వ పేజీ తరువాయి)

దశ నుండి పాలు నిండే దశలో ఉన్నాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేసి నష్టపోయిన రైతులకు అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉండి అన్నివేళలా ఆదుకుంటుందన్నారు. మంత్రి సుభాష్ వెంట కాజులూరు తహసీల్దార్ ఠాగూర్, వ్యవసాయ శాఖ అధికారి వి. అశోక్, పలువురు అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులున్నారు.

అపార నష్టం

(1వ పేజీ తరువాయి)

500 నుండి 1000 ఎకరాల లోపు వరి పంట తుపాను దెబ్బకు నష్టపోయి ఉంటుందని సంబంధిత శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అరటి,కూరగాయల పంటలు దెబ్బతినడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మత్స్యకారులు వేటకు విరామం

నదీ తీర ప్రాంతాల్లో ఉండే మత్స్యకారులు తుపాను ప్రభావంతో అధికారులు సూచనల మేరకు వేటకి విరామం ప్రకటించి ఇళ్లకే పరిమితం అయ్యారు. కరవాక గ్రామంలో 125, గోగన్నమఠం గ్రామంలో 50 బోట్లను గత రెండు రోజులుగా నదీ తీరాన నిలిపివేశారు.

బలమైన ఈదురు గాలులు వల్ల వేట సామాగ్రి కొట్టుకుపోయిందని సుమారు 1400 మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామని వారు చెబుతున్నారు.

పునరావాస కేంద్రాల్లో భాదితులు

మామిడికుదురు మండలం పరిధిలోని 18 గ్రామాల్లో 29 తుపాను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో భోజన సదుపాయాలను స్థానిక ఎన్డీయే కూటమి నాయకులు దగ్గరుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి మేమున్నాం అంటూ భరోసా ఇస్తున్నారు.

నీట మునిగిన వరి పంట

విశాలాంధ్ర-ఏలూరు: తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులు... కురిసిన వర్షపు జల్లులతో పెదపాడు మండలంలోని కొన్ని గ్రామాల్లో

వరి పంట నీట మునిగింది. మరో పది రోజుల్లో వరి కోతలు జరగనున్న నేపథ్యంలో పొలాల్లోకి నీరు చేరడంతో రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. వరి కంకులు నీట మునగడం వలన ధాన్యం మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.పెదపాడు మండలంలోని కృష్ణా కాలువ ఆయకట్టులో 53 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు.పెదపాడు, భీమడోలు, దెందులూరు, చింతలపూడి మండలాల్లో సుమారుగా 2000 ఎకరాలకు పైగా వరి చేలల్లోకి నీరు వచ్చి చేరిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరితోపాటు మిగిలిన పంట నష్టాల వివరాలు పూర్తిస్థాయిలో అందాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. తుపాను తీవ్రత పూర్తిస్థాయిలో తగ్గిన తర్వాత గురువారం నాటికి మరిన్ని వివరాలు అందుతాయని వారు తెలిపారు.

పునరావాస కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-చింతలపూడి: చింతలపూడిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల వద్ద ఎటువంటి సమస్య లేకుండా చూసుకుంటున్నామని చింతలపూడి మండల జనసేన పార్టీ అధ్యక్షులు చీదరాల మధు బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావంతో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని కొట్టిపారవేశారు. చింతలపూడి నియోజక వర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఆదేశాల మేరకు చింతలపూడిలోని పలు కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా కూటమి నాయకులతో కలిపి చూసుకుంటున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు భోజనాలు దగ్గరుండి వడ్డించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల తహసీల్దార్ డిఎల్ ప్రమద్వర, డిప్యూటీ తహసీల్దార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సేవలు భేష్

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో తహసీల్దార్ నజీముల్లాషా సేవలు భేష్ అంటూ ప్రజలు ప్రశంసిస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈయన అప్రమత్తమై తీసుకొన్న జాగ్రత్తలుపై ప్రజల నుంచి సానుకూలత వచ్చింది. లింగపాలెం మండలంలోని

ప్రతి గ్రామం లోని పరిస్థితులను తెలుసుకొని ఆ గ్రామాలలో ముందస్తు చర్యలు తీసుకున్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు.చెరువు కట్టల పై, కాలువ కట్టలపై, లోతట్టు ప్రాంతాలలో నివాసముంటున్న వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించారు. వీరందరికీ భోజన సదు పాయం ఏర్పాటు చేశారు. ప్రమాదంగా ఉన్న చెరువుల అలుగులను మరమ్మతులు చేయించి అధిక వర్షాలు వస్తే నీరు సులభంగా బయటికి వెళ్లేలా సౌకర్యం కల్పించారు. తుఫాను ముందస్తు చర్యలలో సహకరించిన మండల స్థాయి అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని తహసీల్దార్ నజీముల్లాషా అభినందించారు.

కలుపుమందు తాగి దంపతుల ఆత్మహత్య

విశాలాంధ్ర-భీమడోలు: కలుపుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన భీమడోలు గ్రామానికి చెందిన దంపతులు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసు కుంది. భీమడోలు గ్రామంలోని యువ దంపతులు గుండుమోలు సుధాకర్, భానుపూర్ణిమ ఐదేళ్ల క్రితం ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వారికి మూడేళ్ళ కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్య భానుపూర్ణిమను గ్రామానికి చెందిన యువకుడు కఠారి మోహన్ గ్రామాంతరం తీసుకెళ్లడంతో సుధాకర్ కుటుంబ సభ్యులు భీమడోలు పోలీస్ స్టేషన్ లో కిడ్నాప్ కేసు పెట్టారు. 10రోజులు అనంతరం భానుపూర్ణిమ భర్త సుధాకర్ వద్దకు ఇంటికి తిరిగి రావడంతో భార్య భర్తలు భానుపూర్ణిమ, సుధాకర్ లను పెద్దలు తాత్కాలికంగా దూరంగా ఉంచారు. ఈనేపథ్యంలో అవమానభారంతో ఉన్న సుధాకర్ దంపతులు భీమడోలు శివారు వ్యవసాయ క్షేత్రంలో శనివారం సాయంత్రం కలుపు మందుత్రాగి వీడియో సందేశం సోషల్ మీడియాలో పెట్టారు. ఈమేరకు భాను పూర్ణిమ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కఠారి మోహన్ తనకు కుంకుమలాంటిది పూసి మాయమాటలు చెప్పి గ్రామం నుంచి బలవంతంగా తీసుకెళ్లాడని, మోహన్ అనే వ్యక్తి తమ జీవితంలోకి రావటం వల్ల తాము మానసికంగా కుంగిపోతున్నామని, తమకు పోలీసులు న్యాయం చేయాలన్నారు. సుధాకర్ మాట్లాడుతూ తన బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. విషం తాగేముందు రాతపూర్వకంగా లేఖ రాసి, వీడియో తీసి సన్నిహితులకు పంపారు. వెంటనే గమనించిన బంధువులు వీరిని గమనించి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఏలూరు అక్కడ నుంచి గుంటూరు అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భార్య భానుపూర్ణిమ సోమవారం రాత్రి, భర్త సుధాకర్ మంగళవారం అర్ధరాత్రి 2గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందడంతో భీమడోలు గ్రామంలో విషాదఛాయలు అలుకున్నాయి.

విద్యుత్ స్తంభాలపై పడిన భారీ వృక్షం

విశాలాంధ్ర – జీలుగుమిల్లి : మొంథ తుఫాను కారణంగా ఈదురు గాలులతో మంగళవారం రాత్రి లక్ష్మీపురం గ్రామంలో విద్యుత్ స్తంభాలపై భారీ వృక్షం పడింది. దీనితో విద్యుత్ శాఖ వారు హుటాహుటిన విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్తంభాలపై పడిన భారీ వృక్షాన్ని బుధవారం సిబ్బందితో తొలగించారు. ప్రమాదం ఏమి జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎస్సై వి. క్రాంతికుమార్, ప్రత్యేక అధికారి సుబ్బారాయన్, ఎంపీడీవో నిఖిల్ మధు చరణ్, పిఆర్ఏ ఇ. రామానుజం, తహసీల్దారు ఉదయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాదు, విద్యుత్ శాఖ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర – గణపవరం : మొంథా తుపాను ప్రభుత్వ హెచ్చరికలు అనుసరించి ఆక్వా రైతులు జాగ్రత్తలు పాటించాలని గణపవరం మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నర్ల శివరామకృష్ణ బుధ వారం అన్నారు. ఆక్వా రైతులు చెరువులు లోతు పరిశీలించాలని నీరు అధికంగా ఉండకుండా 20 నుంచి 30 సెంటీమీటర్లు తగ్గించాలని చెరువుగట్టు బలంగా ఉండాలని అన్నారు. గట్లు బలహీనంగా ఉంటే ముందుగానే పటిష్టం చేసుకోవాలని అన్నారు. చెరువులో నీటిలో పీహెచ్ సెలినిటీ ఆల్కలినిటీ, ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వర్షాల వల్ల కొత్త నీరు వస్తే చేపలు బయటకు వెళ్లే ప్రమాదం ఉందని పై భాగంలో సేఫ్టీ నెట్ మొగ్గు అమర్చాలని అన్నారు. తప్పనిసరిగా మత్స్యశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు.

ప్రాణనష్టం లేకుండా చర్యలు

పాలకోడేరులో అధికారులతో డిప్యూటీ స్పీకర్ సమీక్ష

విశాలాంధ్ర- పాలకోడేరు : ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న మొంథా తుఫానుపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఉండి శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు పాలకోడేరు విశాల పరపతి సంఘం భవనంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తుఫాను వల్ల ఎటువంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించకుండా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా పాలకోడేరు మండలంలో యనమదుర్రు డ్రైన్ ఉధృతంగా ప్రవహిస్తున్నందున లోతట్టు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి సకల సదుపాయాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ తదితర శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతు సోదరులకు మనోధైర్యం కల్పించాలని అన్నారు. కూటమి నాయకులు సాధారణ పరిస్థితులు వచ్చేంతవరకు నిరంతరం సహాయక చర్యల్లో పాల్గొని ప్రజల అభిమానం చూరగొనాలని అన్నారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి యనమదుర్రు డ్రైన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు, డెల్టా వాటర్ కమిటీ చైర్మన్ కునాధరాజు మురళీ కృష్ణంరాజు, మండల తహసీల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి, ఎంపీడీవో వి. రెడ్డియ్య, ఇతర మండల స్థాయి అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు కృషి

విశాలాంధ్ర – తాడేపల్లిగూడెం:ప్రభుత్వ ఆదేశాలను శిరసా వహిస్తూ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ అహర్నిశలు కృషి చేస్తూ తుఫాన్ బారిన పడకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారని రాష్ట్ర విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా పట్టణంలోని ఆరవవార్డుకు చెందిన సుమారు 20 కుటుంబాలకు చెందిన యానాదులను తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతి, భోజన ఏర్పాటులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపానుకు నిరాశ్రయులైన కుటుంబాలను గుర్తించామని వారందరికీ రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తామని తెలిపారు. కృష్ణంపాలెం, అలంపురం, రావిపాడు తదితర గ్రామాలలో పర్యటించగా ఇప్పటివరకు రైతుల నష్టాన్ని 1400 ఎకరాలను అధికారులు గుర్తించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎమ్మార్వో సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమును పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: కలెక్టర్ చదలవాడ నాగరాణి కలెక్టరేట్లోని "మొంథా తుపాను" కంట్రోల్ రూమును బుధవారం సందర్శించి కంట్రోల్ రూమ్‌కు వచ్చిన కాల్స్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, డివిజనల్, మండల కంట్రోల్ రూమ్‌ల నుండి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను, భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టాలకు సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్ ద్వారా సేకరించి సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. కలెక్టర్ వెంట గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోశ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు వ్యవసాయ అధికారి ముందస్తు సూచనలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మొంథా తుపాను వలన జంగారెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి సి. పవన్ కుమార్ వరి పంటలో సంక్షిప్త క్షేత్ర సందర్శన చేపట్టారు. మండలంలోని తిరుమలపురం గ్రామంలో అధిక వర్షాలకు స్వర్ణ, సంపద స్వర్ణ రకాలు సాగుచేసిన పరిసరాలలో పంట పడిపోవడాన్ని గమనించారు. ప్రస్తుతం వరి పంట పాలు పోసుకునే దశ నుండి గింజ గట్టిపడే దశలో ఉన్నది. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం మండల వరి రైతాంగం గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి 1 గ్రా. కార్బెండజిమ్ లేదా 1 మి.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారి చేసుకోవాలని సూచించారు. గింజ తోడుకునే లేదా గట్టిపడే దశలో వెన్ను బరువువల్ల మొక్కలు కణుపుల వద్ద విరిగి నేలకు ఒరిగినప్పుడు నష్ట నివారణకు పడిపోయిన చేలలో వీలైనంత తొందరగా నీటిని తీసివేసి దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టే చర్యలు చేపట్టాలన్నారు. 5% ఉప్పు ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆస్తి, పంట నష్టం వివరాలను అధికారులకు ఇవ్వండి : ఎంపీ మహేష్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మొంథా తీవ్ర తుపాను సందర్భంగా ఏ సమయంలో ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన ఫోన్ నెంబర్లతో సహా ఇచ్చిన ప్రకటనకు పలు గ్రామాల నుంచి స్పందన లభించింది. ముఖ్యంగా టి.నరసాపురం, పోలవరం, ముదినేపల్లి మండలాల నుంచి ఎంపీ ఫోన్‌కు మంగళ వారం రాత్రి 11 గంటల నుంచి బుధవారం ఉదయం వరకూ పలువురు కాల్ చేసి తమకు తుపాను, భారీ వర్షాలు, తీవ్ర గాలుల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. కాల్స్ కు స్పందించి బాధితులతో స్వయంగా మాట్లాడిన ఎంపీ వెంటనే వెళ్లి వారిని ఆదుకోవాలని ఆయా ప్రాంతాల మండల పార్టీ నాయకులను, అధికారులను ఆదేశించారు. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం 14వ వార్డులో కరెంటు వైర్లు క్రిందికి వేలాడుతూ ప్రజలు భయాందోళన గురవుతున్న సమయంలో ప్రజలు మండల టిడిపి అధ్యక్షులు పారేపల్లి నరేష్ ఫోన్ ద్వారా ఎంపీ మహేష్‌కి సమస్యను తెలియజేయగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఇబ్బంది లేకుండా కరెంటు సమస్యను తీర్చాలని, తుపాను కారణంగా ఒరిగిపోయిన చెట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. పోలవరం మండలం పాతపట్టిసం గ్రామం వద్ద కొవ్వాడ కాల్వ ఉధృతంగా ప్రవహిస్తుం డటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతూ ఫోన్ చేయడంతో స్పందించిన ఎంపీ ఇరిగేషన్ డీఈతో, ఇతర అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. తన మొబైల్‌కు వస్తున్న కాల్స్‌కు స్పందిస్తూ, సహాయ చర్యలు చేపడుతున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు పలు గ్రామాల ప్రజలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు :మొంథా తుపాను ప్రభావంతో ఏలూరు జిల్లాలో పలు ప్రాంతాలు వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ బుధవారం పెదపాడు మండలం లోని నాయుడు గూడెం, రాజుపేట, వట్లూరు, పెదపాడు గ్రామాలను సందర్శించి పంట నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. చైర్‌పర్సన్ పద్మశ్రీ పంట పొలాల్లోకి వెళ్లి, వర్షాల ప్రభావంతో నేలకొరిగిన వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆరాతీశారు. వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ధైర్యం చెబుతూ, ప్రభుత్వం నుండి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు తమ సమస్యలను విన్నవించటంతో దానిపై స్పందించిన ఘంటా పద్మశ్రీ ప్రసాద్ వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులకు నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. చైర్మన్ పద్మశ్రీ వెంట పెదపాడు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు ఉన్నారు.

తుపాను బాధితులకు అండగా ఎమ్మెల్యే మద్దిపాటి

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : మొంథా తుపాను నేపథ్యంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగానే ద్వారక తిరుమల మండలంలో అన్ని ప్రాంతాల్లో తుఫాను బాధిత లకు సహాయక చర్యలు చేపట్టాలన్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మాజీ పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మొగతడకల శ్రీనివాసరావు, మాజీ ద్వారకాతిరుమల జడ్పీటీసీ సభ్యులు మొగతడకల లక్ష్మీ రమణిలు 1500 కొవ్వొత్తులు, 1000 బిస్కెట్ ప్యాకెట్లను మండల ప్రత్యేక అధికారి ఎం.ముక్కంటి, తహసీల్దార్ సుబ్బారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పాకనాటి శేషబాబు, ద్వారకాతిరుమల మండల వాణిజ్య సెల్ అధ్యక్షుడు మహంకాళి గంగాధర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

మునిగిన పంటల వివరాలివ్వండి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలో నీట మునిగిన పంటల వివరాలను ఐదు రోజుల్లో సేకరించి నివేదిక సమర్పించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుండి ఆయన మొంథా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల వలన నీట మునిగిన పంటల వివరాలను తెలుసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల్లో నీట మునిగిన పంటల వివరాలను సేకరించి పంట నష్టాల నివేదికను సమర్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పడిపోయిన పంట పొలాలు నీట మునిగిన వరి చేల నుండి నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఏడీలు, ఎంఏవోలు పాల్గొన్నారు.

గింజ గట్టిపడే దశలో ఒరిగిన వరిచేలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలంలో మొంథా తుపాను కారణంగా సుమారు 1904 ఎకరాలలో పంట నేలమట్టం అయ్యిందని, 46 ఎకరాలలో నీట మునిగిందని

ప్రాథమిక అంచనా వేసామని గణపవరం మండల వ్యవసాయ అధికారి రాయుడు స్వతంత్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. మండలంలో మొయ్యేరు, ముప్పర్తిపాడు, చిలకంపాడు, వల్లూరు, వీరేశ్వరపురం గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఎక్కువగా పాలు పోసుకునే దశ గింజ గట్టి పడే దశలో వరి చేలు ఉన్నాయని, ఈ దశలో నష్టం రైతులకు తీవ్రంగా ఉంటుందని తెలిపారు. రైతులు ముఖ్యంగా వరి చేలల్లో ఉన్న నీటిని బయటకు పోయే మార్గం చూసుకోవాలని తెలిపారు. కుదిరితే నించోపెట్టి దుబ్బులు సుదులుగా కట్టలు కట్టుకోవాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ రైతులకు అందుబాటులో ఉండి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తూ ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుసుమాకరు, సన్నీ జాబిజ, కాళీ ప్రసాదు, ఝాన్సీ పాల్గొన్నారు.

నీట మునిగిన వరిచేలు

విశాలాంధ్ర-తణుకు: మొంథా తుపాను రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. భారీ వర్షాలు, ఈదురుగాలులకు వరి చేలు నీట మునిగాయి. దీంతో రైతులు బాధపడు తున్నారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే సమయానికి తుపాను నట్టేట

ముంచేసిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులకు తణుకు పట్టణంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. స్థానిక శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కే రామకుమార్, తహసిల్దార్ డి వి ఎస్ వర్మ పర్యవేక్షణలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

విశాలాంధ్ర-ఏలూరు: భారతదేశ ఉద్యోగ కార్మిక వర్గానికి అనేక చట్టాలను రాయితీ లను సాధించి పెట్టిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) 106వ వ్యవస్థాపక దినోత్సవంను ఉద్యోగ,శ్రామిక, కార్మిక వర్గం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరపాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటియుసి ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా 1920 అక్టోబర్ 31న ఏఐటియుసి స్థాపించినట్టు తెలిపారు. గడిచిన 105 సంవత్సరాల ఏఐటీయూసీ చరిత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు ఆందోళనలు దేశవ్యాప్తంగా చేయడం ద్వారా 44 కార్మిక చట్టాలను సాధించడంతోపాటు అనేక రాయితీలను సాధించిన ఘనత ఏఐటీయూసీకి ఉందని వారు తెలిపారు. భారతదేశంలో విశాఖ ఉక్కుతో పాటు అనేక పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో ఏర్పాటుకు ఏఐటీయూసీ పోరాటం మరువలేనిదని వారు పేర్కొ న్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీ కరణ విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఏఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉద్యోగ కార్యవర్గం ప్రతిన పూనాలని కృష్ణ చైతన్య, వెంకటేశ్వరరావు ఉద్యోగ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఏఐటియుసి వ్యవస్థాపక దినాన్ని జరపాలని వారు కోరారు.

కామవరపుకోట: ఈ నెల 31వ తేదీ ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సకల కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకోవాలని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు తాడిగడప వెంకట సత్తిరాజు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. బుధవారం కామవరపుకోటలోని మీడియా మిత్రులతో టీవీఎస్ రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ ఆనాడే కార్మికుల హక్కుల కోసం 1920 అక్టోబర్ 31వ తేదీన లాలాజపతి రాయ్ అధ్యక్షతన ఏర్పడిన ఏఐటియుసి దేశంలో పల్లె నుండి ఢిల్లీ వరకు కార్మిక సంఘాలను నిర్మించి దేశవ్యాప్తంగా కార్మిక హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసింది ఏఐటీయూసీ అన్నారు. దేశంలోనే కాక ప్రపంచ కార్మిక సంఘాలకు కూడా నాయకత్వం వహించిన ఘనత ఏఐటీయూసీ దేన న్నారు. ఈ నెల 31వ తేదీన జరిగే ఏఐటీయూసీ వార్షికోత్సవంలో నరేంద్ర మోడీ తొలగించిన 44 కార్మిక చట్టాలను సాధించుకుంటామని ప్రతిజ్ఞ చేయాలని కార్మిక సంఘాలను కోరారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

విశాలాంధ్ర-వీరవాసరం: మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని భీమవరం ఎమ్మెల్యే, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు అన్నారు. స్థానిక ఎంఆర్‌కె జెడ్‌పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించి బాధితులను పరామర్శించారు. తుఫాన్ వల్ల పంటలు మునిగిపోయాయని, రహదారులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలు అవసరం అయితేనే బయటకు రావాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ, పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, భీమవరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుపాను ప్రభావం తక్కువే

విశాలాంధ్ర-పోలవరం: మొంథా తుపాను ప్రభావం పోలవరం నకు తాకిడి.గత రెండు రోజులుగా మబ్బులతో ఓ మోస్తారు వర్షం, చిరు జల్లులు రోజంతా పడ్డాయి. మంగళ వారం రాత్రి ఈదురు గాలులు, వర్షంతో

భయభ్రాంతులకు గురిచేసింది. తాటాకు, పాత ఇళ్లల్లో ఉన్న వారికి భయంతో కంటిమీద కునుకు లేకుండా పోయింది. దీనికి తోడు విద్యుత్తు లేకపోవడంతో రాత్రంతా జాగారం చేయవలసి వచ్చింది. బుధవారం ఉదయం నుండి ఆకాశం మబ్బులు వేసి జడివానతో జనజీవనం స్తంభించింది. గత మూడు రోజులుగా వర్ష ప్రభావ పరిస్థితుల్లో కూలి పనులు లేకుండా పోవడంతో రోజువారి కూలీలు ఇబ్బంది పడుతున్నారు. మొత్తంగా తుపాను ప్రభావం తక్కువగా ఉందని చెప్పవచ్చు.తుఫాన్ పై తహసిల్దార్ సాయిరాజ్ మాట్లాడుతూ పోలవరం మండలంలో తుఫాను ప్రభావం తక్కువగానే ఉందని, దీనివల్ల ప్రాణనష్టం గాని ఆస్తి నష్టం గానీ జరగలేదన్నారు. మంగళవారం రాత్రి 17.5 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. వరి 1725 ఎకరాలు,మినప పంట 975 ఎకరాలు, పత్తి 25 ఎకరాలు, పంట చేలలో నీరు చేరిందన్నారు.

ఎట్టకేలకు 108 వచ్చింది

విశాలాంధ్ర-వీరవాసరం: వీరవాసరం మండల పరిధిలో రెండు ఏళ్ళ క్రితం ప్రారంభోత్సవానికి నోచుకుని అనివార్య కారణాల వలన, అధికారులు, నాయకుల నిర్లక్ష్యం కారణంగా దూరమైనా 108 కోసం మండలంలోని యువత పోరాడి సాధించు కున్నారు. అలా పోరాడి సాధించుకున్న 108 నూతన వాహనాన్ని రెండు మూడు రోజుల నామమాత్రంగా ఉంచి తర్వాత మరల పాత వాహనం పెట్టారు. అది మూన్నాళ్లకే మూలన పడటంతో గత కొన్ని నెలలుగా 108 లేని కారణంగా మండల ప్రజలు

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి నాయకులు, సామాజిక కార్యకర్తలు విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు మరలా నూతన 108 వాహనం మంజూరు చేశారు. ఇది కూడా శాశ్వతమో, తాత్కాలికమో తెలియక ఇప్పుడు కూడా అలానే చేస్తారేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీరవాసరం మండలంలో 108 వాహనం ఉంటే భీమవరం, పాలకోడేరు, పెనుమంట్ర, పెనుగొండ, పాలకొల్లు మండలాల పరిధిలోని గ్రామాలకు అందుబాటులో ఉంటుంది. ఇప్పుడు మంజూరైన 108 వాహనం ఇక్కడే సేవలు అందించే విధంగా చూడాలని మండల అధికారులను, కూటమి నాయకులను మండల ప్రజలు కోరుతున్నారు.

పంటలకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర -ముసునూరు: గత రెండు రోజులుగా మొంథా తుపాను కారణంగా కురుస్తున్న అకాల వర్షాలకు వరి, మినుము, పత్తి పంటల సాగు చేపట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని మండల వ్యవసాయ అధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. మండలంలోని ముసు నూరు, వలసపల్లి, గుడిపాడు తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి బుధవారం ఆమె దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరి వరి సాగు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈదురు గాలులతో కూడిన వర్షానికి పంట సుదులు సుదులుగా

నేలకొరగడంతో వరిగింజ మొలకెత్త కుండా, రంగు మారకుండా ఉండాలంటే ముందుగా ఎకరాకు పది లీటర్ల నీటిలో 500 గ్రాములు కల్లుప్పు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మాగుడు,మాని పండు తెగుళ్ల నివారణకై ఎకరాకు 200 ఎంఎల్ టిల్ట్ (ప్రొపి కోనాజోల్) పిచికారి చేసుకోవాల్సి ఉంటుంది అన్నారు. పత్తిలో తెగుళ్ళ నివారణకై కోసైడ్ మూడు గ్రాములు ఒక లీటరుకు, దానితో పాటు ప్లాంటోమైసిన్ ఒక ఎంల్ లీటర్కు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 270 ఎకరాల్లో వరి పంట,120 ఎకరాల మినుము పంట దెబ్బతిన్నట్లు ఆమె తెలిపారు.

CHANGE OF NAME

I Kancherla Tejaswi, W/o Kancherla Sriram Kumar, Resident Of Door Number, 9-1-74, Jangareddygudem Have Changed My Name From My Previous Name **Vankadaru Tejaswi** To **Kancherla Tejaswi** By Vartue of Marriage.
By Kancherla Tejaswi

మత్స్యకారులకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : మొంథా తుఫాన్ కారణంగా గోదావరి లంకల్లో నుంచి తీసుకు వచ్చి చందా సత్రంలో పునరావాసం కల్పించిన మత్స్యకారులను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ప్రభుత్వపరంగా వారికి కల్పించాల్సిన సౌకర్యాలు అధికారులు కల్పిస్తున్నారా లేదో అని వారిని అడిగి తెలుసుకున్నారు. వారికి నాణ్యమైన ఆహారం, అవసరమైన మెడిసిన్స్ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. తుపాన్ కారణంగా వేటకు వెళ్లని నేపథ్యంలో అలాగే పునరావాస కేంద్రంలో ఉన్న మత్స్యకారులకు ప్రభుత్వం 25 కేజీల బియ్యం, కిలో చొప్పున పంచదార, కందిపప్పు, ఆయిల్ తదితర నిత్యావసర వస్తువులను అందించనుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పునరావాస కేంద్రంలోని మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన బత్తుల వెంకటలక్ష్మి

విశాలాంధ్ర - కోరుకొండ : కోరుకొండ మండలం శ్రీరంగ పట్నం గ్రామంలో మొంథా తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించిన జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి అనంతరం పునరావాస కేంద్రంలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం సందర్శించి నిర్వాసితులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దాల పెద్దమ్మజీ రమణ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు అద్దాల శ్రీను దొడ్డి అప్పలరాజు, గోల్కొండ సత్యనారాయణ, వీఆర్వో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : మొంథా తుఫాను ప్రభావంవల్ల నిరాశ్రయులకు, నిరు పేదలకు మాజీ ఎంపీ వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ సహాయం అందించారు. వైసీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో స్థానిక రాజమండ్రి పుష్కర్ ఘాట్ దగ్గర సుమారు 200మంది పేద ప్రజలకు బుధవారం దుప్పట్లు, రగులు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైసీపీ సిటీ యూత్ అధ్యక్షుడు బిల్లర్ చిన్న సమక్షంలో వీటిని పంపిణీచేశారు. కార్యక్రమంలో ,జిల్లా అధికార ప్రతినిధి,రోక్కం త్రినాధ్,24 వార్డు వైసీపీ నాయకులు కటకం చిన్న, బొర్రా కనక లింగేశ్వరరావు, గౌరి శంకరరావు, సత్తిరాజు, ఉండ్రాజవరపు సూర్య, రమణ పాల్గొన్నారు.

పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేయాలి

-పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల

విశాలాంధ్ర - రాజా నగరం : మొంథా తుఫాను బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో మొంథా తుఫాను ప్రభావిత కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ తన అనుచరవర్గంతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను భారిన పడిన పంటనష్టం నష్టం అంచనాలను నియోజక వర్గ వ్యా ప్తంగా త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు,ఎన్డిఏ కూటమి నాయకులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. మండలంలో సుమారు రెండు వేల ఎకరాలు వరకు పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కళ్యాణ్ సూర్య కుమార్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల ప్రత్యేక అధికారి ఎం.వెంకటేశ్వర్లు,ఎంపీడీవో జె ఏ ఝాన్సీ రాణి, తహశీల్దార్ జి.అనంత లక్ష్మీ సత్యవతి దేవి, ఏఈవో నాగేశ్వరరావు,వివిధ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఎన్డిఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి

- కమిషనర్ రాహుల్ మీనా

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రమాదాలకు, అనారోగ్యానికి గురి కాకుండా పారిశుద్ధ్య సిబ్బంది విధి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. బుధవారం తెల్లవారుజామున వీఎల్‌పురం పరిసర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. జోరు వాన లోనూ ఇబ్బంది పడకుండా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. పారిశుద్ధ్య సిబ్బంది భద్రత కోసం అందజేసిన వ్యక్తిగత రక్షణ కిట్ ఉపయోగించడంతో పాటు వర్షంలో రెయిన్ కోట్లను తప్ప నిసరిగా ధరించాలన్నారు. రాత్రిపూట పనిచేయు సిబ్బందికి రేడియం అప్రాన్లు తప్పనిసరి అని తెలియజేశారు. ఇవి సుంక్షితమైన పని వాతావ రణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పలుచోట్ల కూలిన చెట్ల వద్ద తొలగింపు చర్యలను పర్యవేక్షించారు. తుఫాన్ దృష్ట్యా ప్రజలు కూడా రానున్న రెండు, మూడు రోజులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఆపగలిగాం...పంట నష్టం ఆపలేకపోయాం

వరి పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

నష్టపరిహారం విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ

విశాలాంధ్ర - అనపర్తి : మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనునిత్యం అధికారులను అప్రమత్తం చేసి ఆస్తి నష్టం, ప్రాణాష్టం జరగకుండా ఆపగలిగాం. కానీ పంట నష్టాన్ని ఆపలేకపోయాం. వేల ఎకరాలు అంది వచ్చిన పంట నేలకొరిగిందని రైతులు తీవ్రంగా నష్టపోయారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచారణ వ్యక్తం చేశారు. బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలలో మొంథా తుఫాను ప్రభావంతో నేలకొరిగిన వరి పంట పొలాలను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని , ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిన కారణంగా అధికార యంత్రాంగం సన్నద్ధం అవ్వడం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడగలిగాం అని అన్నారు. తీవ్రంగా నష్టపోయారు, మినుము సంపూర్ణంగా పాడైందని తెలిపారు. వరి పంట కూడా ఇంకొక 15 రోజుల్లో కోతలు ప్రారంభమయ్యే నేపథ్యంలో ఈరోజు ప్రకృతి వైపరీత్యం రావడం వల్ల మొత్తం పంట అంతా నేలకు ఒరిగి మొలకలు వచ్చాయన్నారు. ఈ పరిస్థితిలో రైతాంగం దీనిని ఏ విధంగానూ అమ్ముకోలేని పరిస్థితి వస్తుంది. తప్పనిసరిగా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద మనసు చేసుకుని రైతాంగానికి సహకారం అందించాలని కోరుతూ ఉన్నాను. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో ఇక్కడ ఆయికట్టులో 90% ఈ విధమైన మొక్కలు మొలిచే పరిస్థితి ఉంది అందువలన అధికారులను కూడా కోరుకునేది ఒకటే,జరిగిన వాస్తవాన్ని సమగ్రంగా ప్రభుత్వానికి నివేదించడంలో మీరు రైతు పక్షపాతిగా వ్యవహరించమని కోరుతా ఉన్నాను అని తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి ఈ విష యాన్ని తీసుకెళ్లి రైతుకు న్యాయం జరిగే వరకు మేము అందరం ముఖ్యమంత్రికి వినిపిస్తామని అన్నారు. అనపర్తి తహసీల్దార్ అనిల్, అగ్రికల్చరల్ ఏడి కృష్ణ, ఏవో సురేష్, జనసేన అనపర్తి నియోజకవర్గం ఇంచార్జ్ రవాడ నాగు, అనపర్తి మార్కెట్ కమిటి అధ్యక్షురాలు సూర్యకుమారి, కొప్పవరం సొసైటీ అధ్యక్షులు సబ్బెళ్ళ రామా రెడ్డి, అనపర్తి మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి (దత్తుడు శ్రీను) మాజీ ఎంపిటిసి వెలగల నారాయణరెడ్డి, అధికారులు, అనపర్తి మండలం కూటమి నాయకులు, మహేంద్రవాడ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు నిమగ్నం

విశాలాంధ్ర - కడియం : మొంథా తుఫాను కారణంగా ప్రజలు ధైర్యంగా ఉండాలంటూ అధికారులు, నాయకులు భరోసా కల్పించారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో ఉంటున్న నిరాశ్రయులకు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఉపసర్పంచ్ నాని, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సునీల్, మరియు వెలుగుబంటి యూత్ సభ్యులు భోజనాలు వడ్డించి, ఎవ్వరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. అలాగే తుఫాన్ ప్రభావం వల్ల కడియం ఆవలో నేలకొరిగిన వరి పంటలను ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వ్యవసాయ అధికారి, ఎంపిడిఓ, తహశీ ల్దార్, వీఆర్ఓ, మండల బిజెపి అధ్యక్షులు బొరుసు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి తదితరులు సందర్శించి, రైతులు ధైర్యంగా ఉండాలని కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. వీరవరం గ్రామంలో కరెంట్ స్థంభం పడిపోయిందని మురమండ ఎఇ రామారెడ్డి, తమ సిబ్బందితో కలిసి యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టి, కరెంట్ పోల్ నిలబెట్టారు. ఈసందర్భంగా రామారెడ్డి, పరమటి పట్టాభి, లైన్ మేన్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ సెక్రటరీ సత్తిబాబు తదితరులకు స్థానిక ప్రజలు ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా దామిరెడ్డిపల్లె గ్రామం నుండి దుళ్ళ వెళ్ళే రోడ్డుమార్గంలో తుపాను ప్రభావం వల్ల చెట్లు నేలకు ఒరిగి నర్సరీ రైతులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలిసిన నర్సరీ అసోసియేషన్ సభ్యులు స్పందించి జెసిబితో తొలగించడం జరిగింది. మరో మూడురోజుల పాటు జెసిబి లు అందుబాటులో ఉంటాయని, ఎక్కడ ఇబ్బంది ఏర్పడినా అసోసియేషన్ నెంబర్ 9491474168 లో సంప్రదించాలని, అసోసియేషన్ అధ్యక్షులు రత్నంఅయ్యప్ప తెలియజేశారు.

రైతులను అన్ని విధాల ఆదుకుంటాం

రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

విశాలాంధ్ర - సీతానగరం : తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతీ రైతును అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. బుదవారం మండలంలో చిన కొండేపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో నేలకొరిగిన వరి పంట పొలాలను తహసిల్దార్ ఏ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏ ఈ గురుప్రియ ఆధ్వర్యంలో వెంకటరమణ చౌదరి క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. దీనిలో భాగంగా రైతులతో పంట నష్టం పై వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటామని హామీ ఇస్తూ, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని అన్నారు. అలాగే నష్టపోయిన ప్రతి ఎకరాకు ఇన్‌పుట్ సబ్సిడీ (నష్టపరిహారం) వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు తక్షణం ఉమ్మడిగా సర్వే నిర్వహించి, నియోజకవర్గంలోని పంట నష్టం వివరాలతో కూడిన వాస్తవ నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గెద్దం తిమ్మరావు, సొసైటీ అధ్యక్షుడు కాండ్రు శేఖర్, సీనియర్ నాయకులు గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), వలవల రాజా, కాండ్రు కాశి విశ్వనాథం సింగవరం సర్పంచ్ సంగన చిన పోసియ్య, సురేష్, పృధ్వీ, వి ఆర్ ఓ రమేష్, వి ఏ ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చలిగాలులు తట్టుకోలేక వ్యక్తి మృతి

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండలంలోని పెద్దెవం గ్రామంలో భారీ ఈదురు గాలుల ప్రభావంతో జొన్నకూటి వీర్రాజు (58) అనే వ్యక్తి చలికి తట్టుకోలేక మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మండల అధికారులకు సమాచారం అందించి మృతి పై తక్షణ సమాచారం, తదుపరి చర్యల వివరాలను ఇవ్వాలని కోరారు.

కూలిన వందేళ్ల నాటి వంతెన పిల్లర్

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండలంలోని అన్నదేవరపేట లో కొవ్వాడ కాల్వ పై గల వంద సంవత్సరాల నాటి వంతెన పిల్లర్ తుఫాన్ నేపథ్యం లో పడిపోయింది. అన్నదేవరపేట నుండి టి.మెట్ట, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి తదితర గ్రామాల పంట పొలాలకు వెళ్లేందుకు ఈ వంతెన ఉపయోగ పడుతుంది. వర్షం కానీ కొవ్వాడ లో నీటి ప్రవాహం తక్కువగా ఉన్న సమయం లో కొవ్వాడ పై ఉన్న కాజ్ వే ను రహదరిగా వాడతారు. పురాతన కాలం నాటి ఈ వంతెన ప్రధానదారిగాను, ప్రత్యామ్నాయంగా ఉప యోగపడు తుంది. ఒక పిల్లర్ పడిపోవడంతో రైతులు పొలా లకు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

రైతులను ప్రభుత్వ ఆదుకుంటుంది

విశాలాంధ్ర - నల్లజర్ల : తుఫాను తాకిడికి మండలంలోని సుమారు 1182 ఎకరాలు పంట కు నష్టం వాటిల్లిందని ఏవో సోమశేఖర్ తెలిపారు బుధవారం నల్లజర్ల లోని రైతు కూచిపూడి విఘ్నేశ్వర రావు వ్యవసాయ క్షేత్రంలో నేలకు ఒరిగిన వరిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు. పరిశీలించారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారని, ప్రస్తుత పరిస్థితుల్లో తుఫాను ప్రభావిత ప్రాంతంలోని నష్టపోయిన రైతుల తడిసిన ధాన్యాన్ని పూర్తి ధరకు కొనుగోలు చేయాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

పంట పొలాలను పరిశీలించిన ఎంపీ హరీష్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు, మొసలపల్లి గ్రామాల్లో తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన పంటపొలాలను అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాల యోగి పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి స్థానిక రైతులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులను సదరు గ్రామం మండలంలో వాటిల్లిన నష్టాన్ని అడిగి తెలుసు కున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యవసాయ శాఖ అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహిం చారన్నారు. రైతులకు అండగా ఉంటామని ఎంపీ హరీష్ భరోసా ఇచ్చారు.

పంట పొలంలో గడ్డిమందు స్ప్రే చేశాడని ఫిర్యాదు

విశాలాంధ్ర - కరప : కరప మండలం యండ మూరు గ్రామంలో పంటపొలాలకు గడ్డిమందు స్ప్రె చేసి గుత్తుల సత్యనారాయణ సుమారు అరెకరం పంట నష్ట పరిచాడని కరప పోలీసుస్టేషన్‌లో బుధవారం యండ మూరు గ్రామానికి చెందిన పితాని సతీబాబు, వనుం పహల్ బాబా, విత్తనాల రాంబాబు, వాసంశెట్టి శ్రీను, వనుం విష్ణుమూర్తి, రెడ్డి శ్రీను, పలివెల నాగేశ్వరరావు, పెసలు చంటి, రైతులు ఫిర్యాదు చేసారు. గుత్తు ల సత్యనారాయణ పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని రైతులు కోరారు.

గట్టుకు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఎండ పల్లి కండి కాలువకు గండి పడకుండా గట్టు పటిష్టతకు చర్యలు తీసుకున్నట్లు తూర్పు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మోరాల శెట్టి సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం 400 ఇసుక బస్తాలును ఏర్పాటు చేసి గట్టు దగ్గర వేయించారని తెలిపారు. తుఫాను కార ణంగా వరద నీరు అధికంగా రావడం తో కాలువకు గండి పడుతుందనే ఉద్దేశంతో ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు.

గల్లంతయిన మత్స్యకారుడి కోసం గాలింపు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరం దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరామ్ అనే యువ కుడు కుంభాభిషేకం రేవు వద్ద బోటు నిలుపుదల. బోట్లను తాళ్లతో కట్టేందుకు వెళ్లిన తరుణంలో సముద్రంలో పడి యువకుడు గల్లంతయ్యాడు. గల్లంతయిన యువకుడి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ బృందాలతో పాటు రెస్క్యూ ఆపరేషన్‌లో ఎమ్మెల్యే కొండబాబు కూడా ఉన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తుమ్మలపల్లి రమేష్ విస్తృత పర్యటన

విశాలాంధ్ర - జగ్గంపేట : శృంగారాయుని పాలెం, ఎస్ తిమ్మాపురం గ్రామాలలో పునరా వసర ప్రాంతాలలో భోజన ఏర్పా ట్లు, వసతి ఏర్పాట్లు పరిశీలన ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధి నేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మూడు రోజులుగా విస్తృతంగా పర్య టించి సహాయ కార్యక్ర మాలను బుధవారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ పట్టు చంటి బాబు, ఎంపీటీసీ గరగా గోవింద్, జగ్గంపేట నియో జకవర్గ ఐటీ కో ఆర్డినేటర్ అరిగే రాజేష్, కుంచె రాజు, వీరవరం సొసైటీ డైరెక్ట్ మడుగుల బాబ్జి, కరణం పెద్దకపు, అడపా గం గాధర్, బొజ్జపు శ్రీను, పుణ్యమంతుల శ్రీను, గొడే బాల, గౌతు వీరబాబు, అలుమల్ల నాగు, అలుమల్ల పెద్ద వెంకన్న, మాజీ ఎంపీటీసీ నాగేశ్వరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షాలు

- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా - ట్రాఫిక్‌కు అంతరాయం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మొంథా తుఫాను ప్రభావంతో తీరం దాటే సమ యంలో మంగళవారం అర్ధరాత్రి ఉప్పాడలో ఈదురు గాలులు కుండపోత వర్షానికి పలు చెట్లు విద్యుత్ వైర్లపై నేలకు వరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అమీ నాబాద్ పెట్రోల్ బంక్ సమీపం వద్ద ఉన్న బీచ్ రోడ్‌లో రెండు భారీ వృక్షాలు అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు నేలకు ఒరిగి, విద్యుత్ స్తంభాలు వైర్లు తెగి రోడ్డు మీద పడడంతో బీచ్ రోడ్‌లో ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. ఆర్ అండ్ బి విద్యుత్ శాఖ అధికారులు, చెట్లను, వైర్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.

పంట నష్టంపై ప్రాథమిక అంచనాలు వెంటనే ప్రకటించాలి

- రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కెఎస్ బాబు డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం : వ్యవసాయ ఆధారిత జిల్లా అంబేద్కర్ కోనసీమ జిల్లాపై మొంథా తుఫాన్ కలి గించిన పంటల ప్రాథమిక నష్టం అంచ నాలను జిల్లా యంత్రాంగం వెంటనే ప్రకటించాలని రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కెయస్ బాబు కోరారు. రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వర్యులు కింజరాపు అచ్చం నాయుడు ప్రక రం, సుమారు 20 వేల ఎకరాల వరిపంటకు నష్టం జరిగినట్లు ప్రకటించారు. జిల్లా రైతాంగం, ముఖ్యంగా లంక భూము ల్లో సాగు చేసే రైతులు, ఆక్వా సాగు సంరక్షణ కోసం రైతులు తీవ్రంగా వాపోతున్నారని సతీబాబు పేర్కొ న్నారు. ఈ ప్రకటన ద్వారా జిల్లా అధికారులు దీనిని గమనించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రైతాంగ సమస్యలపై మంచి అవగాహన కలిగిన అధికారి అని అభినందిస్తూ, యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ శాఖ అధికారులను వివిధ వ్యవసాయ ఉత్పత్తుల నష్టం అంచనాల నివేదిక సిద్ధం చేయడానికి దృష్టి సారిం చాలని కోరారు. తుఫాన్ నష్ట నివారణ కోసం ముందస్తు చర్యలు అద్భు త ఫలితాలు ఇచ్చాయని, ఇందుకు జిల్లా కలెక్టర్‌కు రైతు సంఘాల సమ న్వయ సమితి జిల్లా కమిటీ తరపున ప్రత్యేక అభినందనలు తెలి పారు. తుఫాన్ రక్షణ శిబిరాల్లో రమారమి ఏడు వేల మంది నివసిస్తున్నారని, వివిధ ప్రజాసంఘాలు సామాజిక కార్యకర్తలు ఇచ్చిన సమాచారం మేరకు ఇంకా రెండు మూడు వేల మంది తమ ప్రాంతం వదిలి రాలేదని తెలిపారు. వీరందరికీ ఆహారం, మంచినీరు, నివాస వసతి కల్పించడంతో పాటు పారిశుద్ధ్యం, ప్రాథమిక వైద్యం కూడా సమకూ ర్చాలని సతీ బాబు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ముందస్తు చర్యలతోనే ప్రమాద నివారణ : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - రాజోలు : కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలతోనే మొంథా తుఫాన్ వల్ల కలిగే భారీ నష్టాన్ని నివా రించగలిగామని ఎమ్మెల్సీ సోమ వీర్రాజు అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బీజేపీ ప్రతినిధుల బృందం బుధవారం రాజోలు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి సోమ వీర్రాజు బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమ వీర్రాజు మాట్లా డుతూ పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబాని 3 వేలు చొప్పున ఆర్థిక సహాయం, 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు అందిం చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని అన్నారు. మొంథా తుపాన్ నివారణకు ప్రభుత్వం ప్రతీ జిల్లాకు ఇంచార్జీలు నియమించడం, ప్రతీ గ్రామంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థి తులను అయినా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం, కూటమి శ్రేణులు ఎంతో శ్రమించారని అన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, సత్యానంద్, జనరల్ సెక్రెటరీ చీకురుమిల్లి శ్రీని వాస్, అడబాల రాంబాబు, చెల్లింగి త్రినాథ్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

వాడపల్లి దేవస్థానంలో అపారనష్టం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం కాం ణంగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవ స్థానంలో మోస్తరు నష్టం సంభవిం చింది. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులు, వర్షాలు బీభత్సం సృష్టించాయి. దేవస్థానం మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన టెంట్‌కు సంబంధించిన పరికరాలు గాలుల ధాటికి దెబ్బ తిన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదృష్టవశాత్తూ పెద్దగా ప్రాణనష్టం జరగలేదని, అయితే కొంత సామగ్రి దెబ్బతిన్నదని వారు వెల్లడించారు. తుఫాన్ ప్రభావం తగ్గిన వెంటనే దెబ్బతిన్న ప్రాంతాలను పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్, అధికారులు తెలిపారు.

తుఫాన్ పునరావాస కేంద్రాలకు అండగా నిలుస్తున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అధికారులు : ఆత్రేయపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అధికారులు ఉచితముగా ఈ నెల 27వ తేదీ నుంచి మొదలుకొని మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఆలయ అన్నదాన కేంద్రం నుంచి అందజేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారందరికీ భోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు తెలిపారు.

విద్యుత్ అధికారులపై ఎమ్మెల్యే, ఎంపీల ఆగ్రహం

- ప్రాతిపదికపై విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలో విద్యుత్ సరఫరా జాప్యంపై ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బ రాజు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాల యోగి విద్యుత్ అధికారులు పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి నుండి ఇంతవరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించక పోవడంపై అధికారులను ప్రశ్నించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే, ఎంపీలు చీకట్లోనే పల్లం గ్రామం లో పర్యటించి తుఫాన్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఉప్పుటేరు పొంగి పల్లం గ్రామంలోకి ముంపు నీరు వచ్చిన ప్రదేశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ సరైన ప్రణాళిక లేకుండా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రాత్రికి విద్యుత్ సరఫరా చేయా లని వారు ఆదేశించారు. సమ న్వయ లోపమే ఈ సమస్యకు కారణమని ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తు న్నామని యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పనులు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే, ఎంపీలు ఆదేశించారు.

నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి : చిర్ల జగ్గిరెడ్డి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలంలోని ఉచ్చిలి గ్రామంలో ఆలమూరు మండలం చెముడు లంక గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా నేల కొరిగిన వరి పంట, విరిగిన అరటి చెట్లను పరిశీలించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఉచ్చిలి గ్రామం లో 4 ఎకరాలకు సుమారు 2 ఎకరాల అరటి చెట్లు విరిగి నేలకొరిగిన పరి స్థితి నెలకొంది. ఇది ఇలా ఉం డగా మండలం మీద సు మారు 50 శాతం వరకు దెబ్బ తిన్నాయి. అనంతరం జగి రెడ్డి మాట్లాడుతూ నష్ట పోయిన రైతులను వెంటనే ప్రభు త్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన ప్రతీ రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది

విశాలాంధ్ర - కొత్తపేట : మొంథా తుఫాను వల్ల నష్ట పోయిన ప్రతీ రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం పలు మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పొలాలను, అరటి పంటను పరిశీలించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరా పున రుద్ధరించారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముప్పు తప్పిందన్నారు. పున రావాస కేంద్రాల్లో తలదా చుకున్న కుటుంబాలకు రూ.3వేల చొప్పున అందిస్తారన్నారు. పంట చేతికొచ్చే దశలో తుఫాను రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం వారి ని ఆదుకుంటుందని తెలిపారు. ప్రభు త్వం ముందస్తు జాగ్ర త్త చర్యలు తీసుకోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఇం దుకు విశేషంగా కృషిచేసిన ప్రభుత్వ అధికారులు, కూటమి నాయ కులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలియ జేశారు. విపత్తు నిర్వహణలో చంద్రబాబునాయుడు దార్శని కత, ముందుచూపు, విజన్ అక్కరకు వచ్చా యని కొని యాడారు. ఆయన తీసుకున్న చొరవతో, ముందస్తు జాగ్రత్త చర్యలతో నష్టం పెద్దగా లేకుండా బయటపడ్డామన్నారు. ఈ కార్యక్ర మంలో అగ్రికల్చర్ ఏడి రామారావు, హార్టికల్చర్ అధికారులు, ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్, యల్లమెల్లి జగన్మోహన్, యర్రంశెట్టి బుజ్జి, కాసా సాగర్, జక్కంపూడి బాలాజీ, చిన్నం శ్రీనివాసరెడ్డి, పెచ్చెటి చిన్నారావు, గొడవర్తి బాబీ, కోన శ్రీనివాస్, గొడవర్తి భాస్కరరావు, వైట్ల రామారావు, శీలం వెంకటరమణ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - యానాం : గోదారి విజన్ ప్రతినిధి యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల ఏర్పడిన నష్టాన్ని పుదుచ్చేరి ముఖ్యమంత్రి సీఎం రంగస్వామి దృష్టికి తీసుకు వెళ్లినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. బుధవారం ఉదయం యానాం ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్ ప్రభావం వల్ల నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పడిన నష్టాన్ని వివరించారు. గత ఐదు రోజుల నుండి తుఫాన్ ప్రభావం వల్ల భారీ వర్షాలతో అన్ని ప్రాంతాల్లో అపారమైన నష్టం ఏర్పడిందని తెలియజేశారు. ప్రతి రేషన్ కార్డుదారునికి 5000/-వేలు రూపాయలు చెప్పున నష్టపరిహారం ఇవ్వాలని సీఎం రంగస్వామితోపాటు, గవర్నర్ కైలాసనాథ్‌ను కోరమని తెలిపారు. అదేవిధంగా పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ, వివిధ శాఖల అధికారులకు యానాం నియోజకవర్గంలో తూఫాన్ నష్టాన్ని వివరించినట్లు తెలిపారు. ప్రధానంగా ఐదు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో ఏర్పడిన నష్టాన్ని అన్ని వివరాలతో లిఖిత పూర్వకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. యానం నియోజకవర్గం తుఫాను పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే వెంటనే అధికారులతో కలిసి సహాయక చర్యలను అందించగలిగామని తెలియజేశారు. అలాగే తుఫాన్ సమయంలో అధికారులు అద్భుతంగా తమ సేవలను అందజేశారని అన్నారు. యానాం అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసులు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటు ప్రజలకు అత్యవసర సేవలను అందించడం పట్ల వారిని అభినందించారు. తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న ప్రజలకు, పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు యానం ఓల్డ్ ఏజ్ హోమ్ ద్వారా ఆహారం పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు. యానాం ఓల్డ్ ఏజ్ హోమ్ ద్వారా సుమారు 12వేల మందికి భోజనాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా తుఫాన్ బాధితులకు అన్నపూర్ణాలయం ద్వారా పున రావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఆహారాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఏలేరు ఆధునీకరణకు కృషి

-సానా సతీష్ బాబు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేరు ఆధునీకరణకు కృషి చేస్తామని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభతో కలిసి ఏలేరు రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ సందర్భంగా సహాయక చర్యలు చేపట్టిన అధికారులను సిబ్బం దిని అభినందించారు. రిజర్వాయర్ ఆధునీ కరణ పనులు ఎప్పటికప్పుడు వాయిదాలు పర్వం కొనసాగుతుందని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు తగ్గుముఖం పట్టిందని దీంతో నీటిని విడుదలను క్రమేపి తగ్గిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, కూటమి నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, జ్యోతుల పెద్దబాబు, అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, చిక్కాల లక్ష్మణరావు, బద్ది రామారావు ఉన్నారు.

తుఫాను బాధితులను ప్రభుత్వం తక్షణం ఆదుకుంటుంది

విశాలాంధ్ర - దేవరపల్లి : తుఫాను బాధితులను ప్రభుత్వం తక్షణం ఆదుకుంటుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు మండలంలోని పల్లంట్లలో తుఫానుకు దెబ్బతిన్న జాలిపర్తి పాములమ్మ గృహాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాలిపర్తి రాములమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని తక్షణ సహాయ చర్యలు భాగంగా ఎమ్మెల్యే తన సొంతంగా పదివేల రూపాయలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొయ్యలమూడి చినబాబు సుధారాణి దంపతులు ఐదువేల రూపాయలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజవర్గంలో తుఫాను వలన 12 ఇండ్లు దెబ్బతిన్నాయని తెలిపారు ప్రభుత్వం ఇండ్లు నిర్మిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోయిలమూడి చిన్నబాబు సుధారాణి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆచంట శివరామ ప్రసాద్ దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంద్రు అనిల్ ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు ఎంపీడీవో సిహెచ్ నాగార్జునరావు తాసిల్దార్ ఎం శ్రీనివాస్ మండల ఉద్యానవనాధికారి జి రమేష్ తెలుగుదేశం నాయకులు సుంకర దుర్గారావుని గన్నమని ప్రసాద్ తాళ్లూరి శ్రీనివాస్ చింతల దాసు ఉప్పులూరి రామారావు మండపాటి వెంకటరత్నం మండపాటి సత్యనారాయణ సొసైటీ అధ్యక్షుడు ఎల్లమాటి భాస్కరరావు మింటిమి అమరావతి వీఆర్వో శాంతి కార్యదర్శి ఇమ్రాన్ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు కాకినాడ

E.P. 1/2022 O.S. 48/2015

Between:
తాడిమేటి సుభ ...DHr

మరియు

1) చేమకుర్తి సుబ్బారావు, S/o. రాధకృష్ణ మూర్తి, వయస్సు 63 సం॥రం, వ్యాపారం, డో.నెం. 3-16B/22B, Plot No.95, పోస్టల్ కాలనీ, కాకినాడ సిటీ, కాకినాడ.
2) చేమకుర్తి మైథిలీ, W/o. సుబ్బారావు, వయస్సు 56 సం॥లు, గృహిణి, డో.నెం. 3-16B/22B, Plot No.95, పోస్టల్ కాలనీ, కాకినాడ సిటీ, కాకినాడ...JDrs

పైన తెలిపిన JDrs లకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు సమను నోటీసులు పంపిననూ అందుకొనక Evade చేసినందున, యీ పత్రికా ప్రకటన మూలంగా తెలియజేయడమైనది ఏమనగా, మీపై O.S.No. 48/2015 పొందిన డిక్రీ అమలు నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P.No.1/2022 పిటీషను పరిహారార్థం యీ క్రింద ఉదహరించిన షెడ్యూలు ఆస్తిని వేలం వేసి, డిక్రీ సొమ్మును రాబట్టు కొనుటకుగానూ యీ సేల్ నోటీసు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా **ది.ది.07-11-2025 ఉదయం గం॥ 10.30** లగాయతు, శ్రీ కోర్టు వారి సమక్షమున హాజరై మీ సంజాయిషీ చెప్పుకోని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానింతురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఆస్థి షెడ్యూలు: In I.A.451/2015, O.S.48/2015 Attachment before judgement petition on the file of 1st Addl District Judge court, Eluru, W.G.Dist, తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ టౌను, పోస్టల్ కాలనీ, R.S.No.143, Plot No.95, Extent 323 sq.yards, Door No.3-16B/22B. **హద్దులు: తూర్పు** – రోడ్డు. **దక్షిణం:** ప్లాట్‌నం.96 స్థలం. **పడమర:** ప్లాట్ నం.86 స్థలం మరియు రామకృష్ణారావు గారి బిల్డింగు. **ఉత్తరం:** ప్లాట్‌నం.94 స్థలం.
డిక్రీ హోల్డరు దాఖలు చేసిన ఆస్థి షెడ్యూలు.

Item No.1: తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ రిజిష్ట్రీ, పూర్వం కాకినాడ మునిసిపాలిటీ ఏరియా, ప్రస్తుతం కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, వార్డు నం.2, ఓల్డ్ బ్లాక్ నం.2, ప్రస్తుతం వార్డ్ నం.6రు, ప్రస్తుత బ్లాక్ నం.3, కాకినాడ సిటీ, పోస్టల్ కాలనీ ఏరియా, T.S.No.143, ప్లాట్ నం.95రు, 323 చ॥గ॥డోర్.నెం.3-16B/22 గల 2 అంతస్తుల బిల్డింగు లో దక్షిణం వైపున Sq.161-33 yards = sq.134.88 mts ఖాళీ స్థలం అందున గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ Rcc రూఫ్ బిల్డింగుకు హద్దులు: **తూర్పు:** 22 ft. = 6.70 mts - రోడ్డు. **పడమర:** 22 ft. = 6.70 mts - రోడ్డు, ప్లాటు నం.86 నున్నరామ కృష్ణారావు గారి స్థలం. **ఉత్తరం:** ఐటం నం.2 ఈ షెడ్యూలు దాఖలు. **దక్షిణం:** 66 ft.= 20.10 mts - ప్లాటు నం.96 స్థలం.

పైన తెలుపబడిన హద్దుల మధ్యగల Sq.161.33 yards ఇల్లు, స్థలం, అందుల గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ RCC రూఫ్ బిల్డింగ్ అందుల ఉన్న సమస్త ఫిట్టింగులు, ఎలక్ట్రికల్ ఫిట్టింగులు, యీజిమెంటు హక్కులతో సహా..

Item No.2: తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ రిజిష్ట్రీ, పూర్వం కాకినాడ మునిసిపల్ ఏరియా, ప్రస్తుతం కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, వార్డు నం.2, ఓల్డ్ బ్లాక్ నం.2, ప్రస్తుతం వార్డ్ నం.6రు, ప్రస్తుత బ్లాక్ నం.3, కాకినాడ సిటీ, పోస్టల్ కాలనీ ఏరియా, T.S.No.143, ప్లాట్ నం.95రు, 323 చ॥గ॥డోర్.నెం.3-16B/22 గల 2 అంతస్తుల బిల్డింగు, దానిలో ఉత్తరం వైపుగల ఖాళీ స్థలం Sq.161-33 yards = 134.88 sq.mts గ్రౌండ్ ఫ్లోరు, ఫస్ట్ ఫ్లోరు కలిగిన RCC రూఫ్ బిల్డింగుకు హద్దులు: **తూర్పు:** 22 ft.= 6.70 mts - రోడ్డు. **పడమర:** 22 ft. = 6.70 mts - రోడ్డు, మరియు నున్నరామ కృష్ణారావు గారి స్థలం. **ఉత్తరం:** 66 ft. = 20.10 mts - ప్లాటు నం.94 స్థలం మరియు మావుల రాజేశ్వరరావు గారి బిల్డింగు. **దక్షిణం:** యిందుల ఒకటవ ప్రతి.

భమిడిపాటి వెంకటరామశర్మ,
దేవరకొండ వి.యస్.యస్. సుజన, న్యాయవాదులు
కాకినాడ. #25-4-50/1, కొమ్మిరెడ్డివారి వీధి, కాకినాడ.
ది.29-10-2025 సెల్: 92465 89838, 98492 89838

ఎవరూ అధైర్య పడొద్దు

వరద బాధితులను పరామర్శించిన జ్యోతుల నవీన్

విశాలాంధ్ర - జగ్గంపేట : తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు కురిసిన వర్షాలకు కిర్లంపూడి మండలం పాలెంలో చిక్కిరెడ్డి సోమ రాజ ఇల్లు కూలిపోయింది. అదే గ్రామంలో సమ్మిటి అనంతలక్ష్మి పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వారి కుటుంబాలను బుధవారం పరామర్శించారు. వారికి బియ్యం బస్తాలు, నిత్యవసర సరుకులు, ఆర్థిక సాయం అందించారు. క్లస్టర్ ఇంచార్జ్ పాలం శెట్టి మురళీకృష్ణ, పాలెం గ్రామ టిడిపి నాయకులు ఆళ్ల రవి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా టిడిపి అధ్య క్షులు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఎవరు అధైర్య పడవద్దు అన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా కూలిపోయిన ఇంటికి రేకుల షెడ్డు నిర్మాణానికి మెటీరియల్ అందిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాల ఆదుకుంటారని ప్రభుత్వ సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, కిర్లంపూడి మండల టిడిపి అధ్యక్షులు వీరం రెడ్డి కాశి బాబు, వీరవరం సొసైటీ డైరెక్టర్ తోట గాంధీ, ఏలేరు డిసి వైస్ చైర్మన్ నీలం శ్రీను, అడబాల కొండబాబు, దాడి సుబ్బారావు, పోతుల సత్యనారాయణ, తహశీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో హరికృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం సీతా నగరంలోని కోడూరి సత్యనారా యణ, తండ్రి వెంకట్ రావు మర ణాన్ని చింతిస్తూ కుటుంబ సభ్యులను నవీన్ పరామర్శించి వెంకటరావు చిత్రపటానికి పూలమాల వేశారు.

పంట నష్టాలు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో దేవరపల్లి పల్లంట్ల కురుకూరు గ్రామాలలో బుధ వారం డాక్టర్ వైయస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం బుధవారం తుఫాను వలన దెబ్బతిన్న అరటి బొప్పాయి పంటలను పరిశీలించారు మూడు గ్రామాలలో గల పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్ యూనివర్సిటీ ఉద్యానవన శాస్త్రవేత్తలు డాక్టర్ అర్చన ఏ ఎస్ ఆర్ వరప్రసాద్ యు దీపక్ ఏ భాస్కరం మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు కాప్రాక్సిన్ క్లోరైస్ 3 గ్రాములు 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని అన్నారు. పంట నష్టాలు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు శాస్త్రవేత్తలు వెంట దేవరపల్లి మండల ఉద్యానవన అధికారి జి రమేష్ ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

441 హెక్టార్లలో నేలకొరిగిన వరి పంట

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మొంథా తుఫాన్ ప్రభావంతో ఏలేశ్వరం మండలంలో 441 హెక్టార్లలో వరి పంట నేలకొరిగి నట్టు ప్రాథమిక అంచనా. మండలంలోని 6,610 హెక్టార్లలో వరి పంట సాగులో ఉంది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ వరి పంటలు గింజ పాలు పోసుకునే దశలో ఉండగా వేసిన ఈదురు గాలులకు నేలకొరి గిందన్నారు. రైతులు అంతర్ కాలువలు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని బయటకు పంపాలన్నారు. పడిపోయిన మొక్కలను లేపి జడలుగా అల్లాలన్నారు. అనంతరం లీటరుకు 50 గ్రాములు కల్లుప్పు తీసుకుని ఉప్పు ద్రావణంగా తయారుచేసుకుని పిచికారి చేయాలన్నారు.

కనకరాజుకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జీవిత సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర - గోకవరం : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో నిర్వహించబడిన లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు ఫంక్షన్లో ప్రముఖ విద్య, సేవా మూర్తి ప్రగళ్లపాటి కనకరాజు విద్యా విభాగంలో జీవిత సాఫల్య పురస్కారం అవార్డులో అందుకున్నారు. ఈ ఘన సమారోహం సమాజ సేవ, విద్యా సేవ స్ఫూర్తిగా, వాసవి ధర్మా తత్వాల సమ్మేళంగా నిలిచింది. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశం మంగళవారం పుదుచ్చేరిలో అధ్యక్షులు వి ఎస్ డైమండ్ కెజిఎఫ్ ఇరుకుల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగిందని ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టి ట్యూషన్స్ సెక్రెటరీ నాగమణి తెలియజేశారు. కనకరాజుకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జీవిత సాఫల్య పురస్కారంను పుదుచ్చేరి పబ్లిక్ వర్క్స్ శాఖామంత్రి ధీరుకె లక్ష్మీనారాయనన్ చేతుల మీదుగా అవార్డును తీసుకోన్నారు. ఈ సందర్భంగా ప్రగళ్లపాటి కనకరాజు మాట్లాడుతూ ఈ గౌరవం దక్కటం నా వ్యక్తిగత విజయం కాదని ముఖ్యంగా మా భార్య డాక్టర్ నాగమణి ప్రోత్సహం, మా పిల్లలు, అల్లుళ్ళు సహకారంతో మా అధ్యాపక బృందం, విద్యార్థులు విద్యార్థులకు ఉత్తమ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించారని తెలియజేశారు. వాసవి క్లబ్ ఇంట ర్నేషనల్ జీవిత సాఫల్య పురస్కారంను అందుకున్న ఆదర్శ విద్యా సంస్థల అధినేత కనకరాజుకు ఆదర్శ డైరెక్టర్స్ హారిక సంతోష్, ప్రవల్లిక సంతోష్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధ రావు, వైస్ ప్రిన్సిపాల్ సుజిని, ఆదర్శ హై స్కూల్ హెడ్మాస్టర్ సత్య నారాయణ, అధ్యాపక బృందం కామేష్, ప్రేమ్, డాక్టర్ షైదిరాజు, సంకీర్తన, డాక్టర్ గణేష్ కొత్తపల్లి ఆర్యవైశ్య గౌరవ అధ్యక్షులు వీరస్వామి, సోదరులు రామమూర్తి సుబ్బారావు రామకృష్ణ తదితరులు అభినందించారు

చేపలచెరువులు, భూముల కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

డా.బి.ఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, కొమరగిరిపట్నంలో ఉన్న శ్రీలక్ష్మణేశ్వర స్వామి దేవస్థానం, గోడి గ్రామంలో ఉన్న శ్రీరాజలింగేశ్వరస్వామి దేవస్థానంలకు సంబంధించి ఈ తెలిపిన భూములు,చేపలచెరువులను. 2025 - 2026 నుండి 2027 -2028 సం లకు అనగా మూడు సంత్సరాల కాలపరిమితి గాను ఈ క్రింది పట్టికలో తెలిపిన విధంగా తేదీలలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగవేలం నిర్వహించబడును.

12-11-2025 తేదీ బుధవారం మధ్యాహ్నం 3.00 గం॥లకు దేవస్థానము వద్ద ఈక్రింది ఉదహరించిన భూములు వేలం పాటలు పెట్టబడును

భూమి వున్న గ్రామం	రి.స.నెం.	భూమి విస్తీర్ణం	పల్లం /మెరక	పాట ధరావత్తు	సాల్వేన్సీ సర్టిఫికెట్
గోడి	115/8	3.20	లంక భూమి	రూ.3000/-	రూ.100000/-
గోడి	128/15 128/19	0.72 1.15 1.87	పల్లం	.2000/-	5.100000/-
గోడి	181/6	1.42	పల్లం	రూ.5000/-	రూ.100000/-
మొగళ్ళమూరు	50/1	2.67	పల్లం	రూ.10000/-	రూ.100000/-
మొగళ్ళమూరు	3/3	2.16	లంక భూమి	రూ.2000/-	రూ.100000/-
	మొత్తం	11.32			

ది. 12-11-2025 తేదీ బుధవారం ఉదయం 10:30 గం॥లకు రెల్లుగడ్డ గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానము వద్ద రాజలింగేశ్వర స్వామి వారి దేవస్థానంనకు చెందిన భూములు వేలం పాట పెట్టబడును

రెల్లుగడ్డ	118	7.56	చేపల చేరువు	రూ.100000/-	రూ.2000000/-
	మొత్తం	7.56			

ది.12-11-2025 తేదీ బుధవారం ఉదయం 11:30 గం॥లకు తూర్పు లంక, గ్రామపంచాయితీ వద్ద లక్ష్మణేశ్వర స్వామి వారి దేవస్థానంనకు చెందిన భూములు వేలంపాట పెట్టబడును

భూమి వున్న గ్రామం	రి.స.నెం.	భూమి విస్తీర్ణం	పల్లం /మెరక	పాట ధరావత్తు	సాల్వేన్సీ సర్టిఫికెట్
తూర్పు లంక	132/2	1.82	చేపల చేరువు	రూ.5000/-	200000/-
తూర్పు లంక	132/2	0.61	చేపల చేరువు	రూ.2000/-	100000/-

ఈ దిగువ ఉదహరించిన కొబ్బరిచెట్లు యొక్క ఫలసాయం సదరు శ్రీ లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానము వద్ద తేదీ బుధవారం మధ్యాహ్నం 12:30 గం॥లకు వేలం పాట పెట్టబడును

తుమ్మలపల్లి పుత గట్టున కొబ్బరిచెట్లు			మెరక	రూ.1000/-	రూ.100000/-

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ కీర్తి పరిశీలన

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం పర్యటించారు. ఆర్డీవో రాణి సుస్మిత, వ్యవసాయ, రెవెన్యూ, సస్యరక్షణ తదితర శాఖల అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో రైతులతో ముఖాముఖి మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 18 మండలాల్లో వరి పంట, 5 మండలాల్లో మినుము పంట సాగు విస్తీర్ణం ఉందని పేర్కొన్నారు. చాగల్లు మండలంలో మొత్తం 1,941 హెక్టార్లలో వరి సాగు చేయగా, మొంథా తుఫాను ప్రభావంతో 124 హెక్టార్ల పంట పడిపోవడం, 3 హెక్టార్ల పంట నీటమునిగి నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ం "మొంథా తుఫాను కారణంగా జిల్లాలో ఇప్పటి వరకు 13,500 హెక్టార్లలో వరి పంట కూలిపోగా, 2,050 హెక్టార్లలో నీటి లో పాక్షికంగా మునిగిన పరిస్థితి నెలకొంది. తుఫాన్ తగ్గిన తర్వాత వెంటనే రైతులు పంటల రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటమునిగిన పొలాల్లో పిల్ల కాల్వలు ఏర్పాటుచేసి నీరు తక్షణమే బయటకు వెళ్లేలా చూడాలి. పడిపోయిన కంకులను కట్టలుగా చేసి నిలబెట్టడం ద్వారా ధాన్యం నష్టాన్ని నివారించవచ్చు. మొలకలు రాకుండా ఉండేందుకు 5% ఉప్పు ద్రావణాన్ని కంకులపై పిచికారి చేయాలి. కలెక్టర్ మాట్లాడుతూ "ప్రతి రైతు పంట నష్టం వివరాలు సరిగా నమోదు చేసి, ప్రభుత్వం అందించే సాయం పొందేలా అధికారులు చూసుకోవాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఆర్డీవో రాణి సుస్మిత, వ్యవసాయ అధి కారులు, మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నష్టం అంచనాల ప్రక్రియ ప్రారంభించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : మొంథా తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలు సకాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేయడంతో పాటు నష్టం అంచనాల ప్రక్రియ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ తన క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, వ్యవసాయం, మత్స్య, పౌరసరఫరాలు, చేనేత శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ, పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం, తుఫాను నష్ట గణన ప్రక్రియకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన చర్చించి, అధికారులకు దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ..తుఫాను బాధితులకు సకాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు రోజువారీ నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లోని ప్రతి కుటుంబానికి రూ. 3 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం (మత్స్యకారులకు 50 కేజీల బియ్యం), 1కిలో పప్పు, 1లీటరు వంట నూనె, 1కిలో ఉల్లిపాయలు, 1కిలో బంగాళాదుంపలు, 1కిలో చక్కెర అందజేయాలని ఆయన తెలిపారు. అదేవిధంగా తుఫాను నష్ట గణన ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను సూచించారు. జూమ్ కాన్ఫరెన్స్ లో డీఆర్వో వెంకటరావు, వ్యవసాయ, మత్స్య శాఖ అధికారులు ఎన్ విజయ్ కుమార్, పి కృష్ణారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం దేవులా నాయక్, డీఎస్వో ప్రసాద్ రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె శ్రీరమణి, పాడా పీడీ చైత్ర వర్షిణి, ఎస్పీ డీఎస్పీ సత్య నారాయణ, చేనేత శాఖ ఏడీ పెద్దిరాజు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలపై నివేదిక సమర్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : రానున్న రెండురోజులలో జిల్లా అంతటా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి బుధవారం తుఫాన్ అనంతరం పారిశుద్ధ్య, సహాయక కార్యక్రమాలు , నష్టం నివా రణ అంచనాలపై అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫ రెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో భారీవర్షాలు సంభవించాయని, వర్షాలు కారణంగా గ్రామాలు, పట్టణాలు,నగరాలలో వరదనీరు నిల్వ లేకుండా చూడా లన్నారు. ఎక్కడా చెత్త లేకుండా శుభ్రం చేయించాలని,త్రాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించి సరఫరా చేయాలన్నారు. తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న పంటల నష్టాలను వ్యవ సాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక వెంటనే సమర్పించాలన్నారు. వ్యవసాయ,ఉద్యానవనాలు, పశుసంవర్ధకం, ఆక్వా నష్టాలకు సంబంధించి సంబం ధిత సిబ్బంది వెంటనే ఎన్యూమరేషన్ ప్రారం భించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో స్టాక్ ఉండేలా చూడాలన్నారు. తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న రోడ్లు, కాజ్ వేలు, కల్వర్టులు, విద్యుత్ స్థంబాలు, పాఠశాల ,ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ చెరువులు, కాల్వలు,నదులు గట్లను పరిశీలించి, బలహీన గట్ల పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

రెండు నెలల్లో ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర- ఉండి: రైతులకు ఇబ్బంది లేని విధంగా సాగునీరు సాఫీగా పారేందుకు రానున్న రెండు నెలల్లో కాలువలు, డ్రైన్లు ఆక్రమణలను నూరు శాతం తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు స్పష్టం చేశారు.బుధవారం ఉండి మండలం వాంద్రం గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా బలమైన గాలుల ప్రభావంతో నేల కొరిగిన వరి పంటను రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వాంద్రం గ్రామంలోని 600 ఎకరాలకు సంబంధించిన నీరు ఇసుక డ్రెయిన్ ద్వారా వెళ్లవలసి ఉంటుందని,డ్రెయిన్ కుంచించుకుపోవడంతో సాగునీరు సాఫీగా పారుదల లేక పంట నష్టపోతున్నామని ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకురాగా ఈ సమస్య పరిష్కారానికి ఆక్రమణలను తొలగించి వాస్తవంగా డ్రెయిన్ ఎంత ఉండాలో తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ వాంద్రం గ్రామంలో ఉన్న 900 ఎకరాలకు సుమారు 50 ఎకరాలు మేర వరి చేను నేలకొరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉండి నియోజకవర్గంలో 80 శాతం మేర డ్రైన్లు,కాలువలపై ఆక్రమణలు తొలగించి నీటిపారుదల వ్యవస్థను స్థిరీకరించినట్టు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఉండి తహసీల్దార్ నాగార్జున, వ్యవసాయ శాఖ ఏడీ, రైతులు, తదితరులు ఉన్నారు.

అధైర్య పడొద్దు ... ప్రభుత్వం అండగా ఉంది

విశాలాంధ్ర - కలిదిండి, మండవల్లి : మొంథా తుపానుతో ప్రజలు అధైర్య పడవద్దు అని ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మం డలంలో పడమటిపాలెం గ్రామంలో బంకు కాలని, సున్నంపూడి, దుంపలకోడు దిబ్బ, చిన్న తాడినాడ గ్రామాలలో పర్యటించారు. తుపాను బాధితుల కోసం ప్రభుత్వ పాఠశాలలో, పలు చోట్ల ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవడానికి ప్రభు త్వం సిద్ధంగా ఉందని, అధికారులు కూడా చాలా చక్కగా వారి విధులు నిర్వహిస్తూ ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసుకున్నారని తెలిపారు. డిసిలు, నీటిసంఘం నాయకులు, డ్రైనేజి అధికారులు సమన్వయంతో డ్రైన్లు, కాలువలు ప్రక్షా ళన తో నియోజకవర్గంలో ముంపు శాతం తగ్గిందని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో త్వరిత గతిన సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదే శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జోగి రాజు, మాజీ ఏఎంసి చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

మండవల్లిలో : పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు, పుల్లవ డ్రైన్ నీటి ప్రవాహాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, స్థానిక పరిస్థితులను సమీక్షిం చారు. మణుగునూరు, పెనుమాకలంక గ్రామాల ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం భైరవపట్నం హై స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు అధైర్యపడవద్దని,ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని,రెస్క్యూ ఫోర్స్ బృందాలను సిద్ధం చేసిందని,తుఫాన్ కారణంగా గూడు కోల్పోయిన వారు ప్రభుత్వ సాయం పొందేందుకు ఈ పునరావాస కేంద్రాలను వినియోగించుకోవా లన్నారు. బాధితులకు అవసరమైన ఆహారం, మందులు అం దేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించా నని, ప్రభుత్వం చేసే సహాయం తో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు మానవత్వంతో ముందుకు రావా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కారు ఆపకుండా వెళ్లిపోయిన ఎంపీ

- మత్స్యకారులు రోడ్డుపై ధర్నా
- కాకినాడ ఎంపీ రావాలంటూ నినాదాలు



విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఉప్పాడ పర్యటనకు వచ్చిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు ఉప్పాడ నాయక్ కాలనీ 1 చెందిన మత్స్యకార సమస్యలు తెలుపుకునేందుకు ఎదురుచూస్తున్న మత్స్యకారులు వద్ద కాకినాడ ఎంపీ శ్రీనివాస్ కారు ఆపకుండా వెళ్లిపోవడంతో బీచ్ రోడ్డుపై బైఠాయించి మత్స్యకారులు ధర్నా చేపట్టారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తపట్నం పరిసర ప్రాంతాల్లో బుధవారం పర్యటనకు వచ్చిన కాకినాడ ఎంపీ కోసం నాయ కర్ కాలనీకి చెందిన పలువురు మత్స్యకారులు సమస్యలు తెలుసుకునేందుకు బీచ్ రోడ్డుకి ఇరువైపులా ఉండి ఎంపీ వాహనం వచ్చే సమయంలో వాహనం ఆపే ప్రయత్నం చేసిన వాహనం ఆప కపోవడంతో ఆగ్రహించిన మత్స్యకారులు ఓట్లు వేసి గెలిపించిన ఎంపీకి మత్స్య కార సమస్యలు తెలుపుదామంటే వాహనం ఆపకుండా వెళ్లిపోతారా అంటూ బీచ్ రోడ్డుపై బైఠాయించి ఎంపీ తిరిగి రావాలంటూ ధర్నా చేపట్టారు.

నిరుపేద కుటుంబాలకు పోలీస్ సహకారం

విశాలాంధ్ర - నల్లజర్ల : మండలంలోని తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాల వద్ద తలదాచుకుంటున్న నిరుపేద కుటుంబాలను నల్లజర్ల ఎస్సై దుర్గ ప్రసాద్ కలిశారు. వారికి ముందుగా పండ్లు అందజేశారు. మండలం లోని దూబచర్ల, కొత్తగూడెం, అయ్యవరం గ్రామాలలో ఆయన వెళ్లి నేరుగా నిరుపేదల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో ఎవరింట్లో వారు ఉంటూ జీవనం సాగిస్తారని, కాని ఎటువంటి ఇళ్ళు లేకుండా విపత్తు పరిస్థితుల్లో నిరు పేదలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న సమయంలో వారికి అండగా నిలవడం ద్వారా వారికి ధైర్యం కల్పించినవారు అవుతారని ఆయన అన్నారు. నిరు పేద కుటుంబాలకు తమ పోలీస్ నుంచి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్ఐదుర్గాప్రసాద్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గుడిసె శివకృష్ణ, చుక్క శ్రీనివాస్,పురేళ్ళ సత్యనారాయణ, కఠారి సాయి తేజ, దూబచర్ల సర్పంచ్ తాడిగడప బాలయ్య, కడారి కొండబాబు, సూరిబోయిన చిన్న నాగేశ్వ రావు, వి ఆర్ ఓ అరుణ జ్యోతి సామాజిక వేత్తలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జనసేన నాయకులు

విశాలాంధ్ర - కోరుకొండ : రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాలు మేరకు బూరుగుపూడి గ్రామంలో మొంథా తుఫాన్ వల్ల ఆరోగ్యం పట్ల వచ్చే ఇబ్బందుల వల్ల. జాగ్రత్త చర్యగా గ్రామంలో ఉన్న అందరీ ఇంటింటికి వెళ్లి ఆరోగ్య విషయాలు తెలుసు కుని. వ్యాధులు ప్రభలించకుండా ముందు జాగ్రత్తగా చర్యగా ఉచితంగా మందులు పంపిణీ చేయడం. ఏ అవసరం వచ్చినా మేము అండగాఉంటామని . ఏఎన్ ఎం ఆశ వర్కర్స్ హెల్త్ కి సంబంధించిన డిపార్ట్మెంట్ ఇంటింటికివెళ్లి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు

ప్రాణనష్టాన్ని తగ్గించాం..ప్రజలకు భరోసా కల్పించాం

మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపు, వాతావరణ శాఖ హెచ్చరికలు, అధికార యంత్రాంగం సమన్వయంతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధ వారం ఆయన ఓదూరు గ్రామంలో తుఫానుకు నేల వారిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తుఫాను పట్ల వాతా వరణ శాఖ ముందే హెచ్చరికలు జారీ చేసిన నేప థ్యంలో కూటమి ప్రభుత్వం అధికార యంత్రాం గాన్ని, ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ నష్టం జరగకుండా కాపాడుకున్నాం అన్నారు. తుఫాను ముందస్తు చర్యలతో పాటు, 8 నెలలు దాటిన గర్భిణీ స్త్రీలను హాస్పిటల్స్‌లో చేర్చ డం, వృద్ధులు పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ, లక్షల మం దిని తుఫాను సహాయక శిబిరాల్లో చేర్చి వారికి అన్ని సదుపాయాలు కల్పించడం, 24/7 నిరంతరం సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధి కార యంత్రాంగం అందరూ పరిస్థితులు సమీక్షిస్తూ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల నష్టాన్ని తగ్గించ గలిగామన్నారు. ఇది ఖచ్చితంగా సీఎం చంద్రబాబు నాయుడు లాంటి అత్యంత సమర్థ నాయకుడు మైక్రో లెవెల్ మేనేజ్మెంట్ చేయగలగడం వల్లనే సాధ్యమైందన్నారు. అలాగే పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్క రికి మూడు వేలు ఆర్థిక సహాయం, 25 కేజీల బియ్యం, నిత్యవసరాలు ఇచ్చేందుకు నిర్ణయించి దన్నారు. తుఫాను కారణంగా పనులు లేని కుటుం బాలకు ఆర్థిక సహాయం ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. అలాగే మత్స్యకారులకు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం ఇస్తామని మంత్రి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగాలపేటలోని మత్స్యకారులకు భవానీ చారిటబుల్ ట్రస్టు వితరణ

విశాలాంధ్ర - రాజ మండ్రి సిటీ :మొంథా తుపాను వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహాయ పునరావాస చర్యలు సకా లంలో చేపట్టడంతో పాటు ప్రాణ నష్టం ఆస్తి నష్టం లేకుండా చూడగలిగామని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. దీని కోసం గత 36 గంటలుగా తనతోపాటు కష్టపడి తిరుగుతున్న టీడీపీ జనసేన బీజేపీ కూటమి కుటుంబ సభ్యులకు అభి నందనలు తెలియచేస్తున్నామని, అలాగే సమన్వయంతో పనిచేసి ఎప్పటి కప్పుడు సహాయ చర్యలు చేపట్టిన అన్ని శాఖల అధికార యంత్రాంగానికి ఆయన అభినందనలు తెలిపారు. బుధవారం కోటిలింగాలపేటలోని 100 మత్స్యకార కుటుంబాలకు భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పది కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పంచదార, లీటర్ పామాయిల్ ప్యాకెట్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పంపిణీ చేశారు. ఎంతో దూరదృష్టితో ,అవగాహనతో కూటమి నాయకులు సమర్థవంతంగా పని చేశారని చెప్పారు. తాను సుమారు 10 గంటలపాటు కమాండ్ కంట్రోలు రూములో ఉండి పరిస్థితిని పర్యవేక్షించినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు.ఎక్కడా ప్రజలు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయగలిగామని ఆయన అన్నారు. తాము ఇంత కష్టపడి పని చేస్తుంటే వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, రాజమండ్రిలో ఒక చెట్టు ఊగడంలేదని,ఆకు కదలడం లేదని ఇక్కడ తుపాను ప్రభావం లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులను పునరావాస కేంద్రానికి తరలింపు

విశాలాంధ్ర - కడియం : ప్రజలు ఏ విధమైన భయభ్రాం తులకు లోనుకాకుండా ధైర్యంగా ఉండాలని, అలాగే అధికారుల సూచనలు, జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కడియం ఎంపీడీవో కె రమేష్, తాసిల్దార్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. మొంథా తుఫాను కారణంగా ముందస్తు చర్యలుగా నిరాశ్రయులైన కడియం మండల ప్రజలకోసం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. మండలంలో ప్రమాదకర ప్రదేశాలలో ఉన్న దాదాపు 200 మంది నిరాశ్రయులను గుర్తించి ఈ కేంద్రానికి తర లించినట్లు తెలిపారు. నిరాశ్రయులు ఎవరైనా ఇంకా ఉంటే కడియం హైస్కూ ల్‌కు స్వచ్ఛందంగా రావాలని విజ్ఞప్తి చేశారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంపీపీ వెలుగు బంటి ప్రసాద్, సిఐ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.

తుఫాను బాధితులకు తోట నరసింహం పరామర్శ

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రస్తుతం మొంథా తుఫాను కారణంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని పాలెంలో ఇల్లు పడిపోయిన చిక్కిరెడ్డి సోమరాజు కుటుంబాన్ని బుధవారం ఉదయం పరామర్శించిన అనంతరం ఎంపీ తోట నరసింహం వారికి హార్దిక సహాయం అందజేశారు. తర్వాత సంబంధిత అధికారు సంబంధితలతో నరసింహ మాట్లాడి ఆ కుటుంబానికి వెంటనే ప్రభుత్వం వైపు నుంచి అన్నివిధాలా సహకారం అందించాలన్నారు. రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాలంటరీ విభాగం జాయింట్ సెక్రెటరీ మరియు తామరద గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న, తోట బాబ్జి, పాలెంగ్రామ సర్పంచ్ ఆడబాల సుబ్బా రాయుడు, కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ బేరి బాబ్జి, కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఓలేటి రాజేశ్వరరావు(రాజు), జగ్గంపేట మండలం అధ్యక్షుడు, వైసిపి సీనియర్ నాయ కులు రావుల రాజా, అరిశ సత్యనారాయణ, పెద్దిరెడ్డి లక్ష్మణ్, అప్పా రావు, పాలెం గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం ఏర్పాట్లు పరిశీలించిన డ్వామా పిడి వెంకటలక్ష్మి

విశాలాంధ్ర - తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో ఏర్పాటు చేసిన తుఫాన్ బాధి తుల పునరావాసా కేంద్రంను కాకినాడ జిల్లా డ్వామా పిడీ అడపా వెంకటలక్ష్మి సంద ర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న వారికి అందుతున్న సదుపా యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ మొత్తం నిర్వ హిస్తున్న కేంద్రాలకు సంబంధించిన వంటలు ను పరిశీలించారు. తుఫాన్ కేంద్రంలో ఉన్న అందరిచేతే తుఫాన్ గండం నుండి విజయవంతంగా బయట పడినందుకు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కోర్పరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, తాళ్ళరేవు మండల టీడీపీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి), పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణ, సుబ్బారావు, విష్ణు, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, సత్తి కొండ, నాగార్జున, నారాయణమూర్తి, బుజ్జి, ఏడుకొండలు, శ్రీను పాల్గొన్నారు.

'సేవ' సామాజిక బాధ్యత..

మొంథా తుపాను బాధితులకు బాసటగా జమ్మలమడక

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బాసటగా నిలిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. మంగళవారం జమ్మలమడక నాగమణి యువసేన ఆధ్వర్యంలో కాకినాడ, చీరాలలో పలు సేవా కార్యక్ర మాలను చేపట్టారు. ఆమె గౌరవాధ్యక్షురాలిగా ఏర్పాటైన కాకినాడ గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్, చీరాల కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం, పళ్లు, బిస్కెట్లు అందించారు. కాకినాడ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకి నాడ ప్రభుత్వాస్పత్రి వద్ద రోగులకు వారి బంధువులకు ఆహారాన్ని అందిం చారు. అదే సమయంలో చీరాల మండలం చినగంజాం ప్రభుత్వాస్పత్రిలో కృతి ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆకురాతి అశ్విని ఆధ్వర్యంలో రోగులకు వారి బంధువులకు ఆహారాన్ని అందజేసారు. పరోపకారమే పరమావధిగా ఫౌండే షన్ సేవలు కొనసాగిస్తున్నామని నాగమణి పేర్కొన్నారు. మొంథా తుపాన్ నేపథ్యంలో చీరాల చినగం జాం అంధుల పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని.. అక్కడ తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు పళ్లు, బిస్కెట్లు అందించారు. తుపాను తీరం దాటినా దాని ప్రభావం మరో 24 గంటలు ఉంటుందని ప్రభుత్వం, అధికారులు సూచిస్తున్న తరుణంలో ప్రజలు సురక్షితంగా పునరా వస కేంద్రాల్లో తలదాచుకోవాలని జమ్మలమడక నాగమణి అక్కడి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్, కృతి ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంటను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - కడియం : మొంథా తుఫాను ప్రభావంతో కడియం మండలంలోని కడియం గ్రామ పరిధిలో సర్వే నంబర్ 455 నుంచి 695 వరకు ఉన్న ఆవ పొలాలను, నీటమునిగిన ప్రాంతాలను బుధవారం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్ కృష్ణ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవ రావు పరిశీలించారు. తుఫాను తగ్గిన తరువాత, తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. చేలో నిల్వ ఉన్న నీటిని పిల్ల కాలువలు ఏర్పాటు చేసి బయటకు పంపేలా చూడాలని, పూర్తిగా పడిపోయిన కంకులను కట్టలుగా కట్టి నిలబెట్టడం ద్వారా ధాన్యం నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొలక రాకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని కంకులపై పిచికారీ చేయా లని రైతులకు సూచించారు.

పంట నష్టం అంచనా

విశాలాంధ్ర - పెదపూడి : మొంథా తుపాను ప్రభావంతో వరి, ఇతర పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టం అంచనాలు తయారీపై సమన్వయ సమావేశం బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదపూడి మండలంలో సుమారు 10 వేల 496 ఎకరాల్లో వరి పంట పాడైందన్నారు. అలాగే నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో పంట నష్ట నివేదికలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకోడానికి కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తుగ సూర్యకుమారి, వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి, స్థానిక పీఏసీఎస్ చైర్మన పుట్టా గంగాధర చౌదరి, కాకినాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య పావన మూర్తి అస్తమయం

విశాలాంధ్ర - కరప : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యునిగా పని చేసిన అంబేద్కరీ యుల్లో ఒకరైన చింతకాయల పావ నమూర్తి పరి నిర్వాణం చెందడం కరప మండల అంబేద్కరీయులకు తీరనిలోటని కరప మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. పావనమూర్తి యానాం ప్రాంత వాస్తవ్యులు. సర్వ మానవ సమానత్వమును బోధించిన బుద్ధిజం వ్యాప్తికై అహర్నిశలు కృషి చేసారు. ఎంతో మంది విద్యావంతులకు అంబేద్కర్ ఆలోచన విధానం వైపు నడిపి, తద్వారా వారు జాతి సేవకు ఉపక్రమించేలా చేయడంలో తనదైన పాత్ర పోషించారు. పావనమూర్తికి ధమ్మ నివాళి అర్పించారు. సర్వీస్ టాక్స్ అధికారి సాంబత్తుల వెంకట్రావు, రిటైర్డ్ ఎంపిడిఓ మారెళ్ల రాఘవులు, రిటైర్డ్ పోలీస్ పేరేళ్ల చంద్రరావు, రచయిత సవిలే రాజేష్, అంబేద్కరీయులు దోనం నీలకంఠ, త్రిరత్న బౌద్ధధమ్మ సంఘం కరపమండలాధ్యక్షులు మాతా అప్పారావు, సాదే వీర రాఘవులు, మండల ఎస్సీ నాయకులు మారేళ్ల వెంకట రమణ, పులపాకుర శు భమహేశ్వరరావు, చిన్నం వెంకటేశ్వరరావు, వజ్రపు కామేశ్వరరావు, దాలిపర్తి శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు.